



స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ప్రధాన ఎన్నికల కమీషనర్ దంపతులు


# ఎన్ఆర్ఇజిఎస్‌ను యథావిధిగా కొనసాగించాలి

**- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

అన్ని ప్రజాసంఘాలు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కల్లూరు తహశీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ 2005 సంవత్సరంలో వామపక్షాల ఒత్తిడి వల్ల అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు వలసలు నివారించడం కోసం వందరోజుల పని దినాన్ని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం తెచ్చిందని అన్నారు. ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ వికసిత్ భారత్ జి రామ్ జి స్కీముగా మార్పు చేయడం సిగ్గుచేటని ప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలన్నారు. దీనివల్ల 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందని అన్నారు. మన రాష్ట్రంలో 7 వేల కోట్ల మొత్తంలో రూ.3200 కోట్లు ఇప్పుడు పథకం ప్రకారం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం భరించలేక స్కీమును అమలు చేయడం కష్టంగా మారుతుందని అన్నారు. గ్రామీణ పేదలకు నష్టం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులతో రాష్ట్రాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్రాలపై వేసిన భారాన్ని తగ్గించి నిధులు కేంద్రమే భరించాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, మా బాధలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.మధు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.కృష్ణ రైతు నాయకులు, సిఐటియు నాయకులు జమ్మన్న, పూలరంగడు, గాలెన్న నారాయణరెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి :** కేంద్రం తీసుకున్న విబి రాంజీ పథకాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి జి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం పట్ల ధర్నా కార్యక్రమం చేపట్టారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో బి.నాగన్న , జి.శ్రీధర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. అన్నారు. వెంటనే ఈపథకాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు టి మల్లేష్, నాగరాజు, డివైఎఫ్ఐ మండల నాయకులు మహేష్ ప్రజా సంఘాల కార్యకర్తలు సలాంబాష, హరి, ఎల్లయ్య, బొజ్జన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

## మల్లన్న సన్నిధిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ దంపతులు

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్**

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీశైల దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వద్ద వేద పండితులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి విభూతి, కుంకుమ ధరింపజేసి ప్రదక్షిణ మార్గం ద్వారా ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు. మొదటగా ధ్వజస్తంభానికి నమస్కరించి శివ సంకల్పం చేశారు. అనంతరం రత్నగర్భ గణపతికి పూజ చేశారు. ఆ తరువాత మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి విశేష పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం నందీశ్వర దర్శనం చేసి, అర్చకుల చేత స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వృద్ధ మల్లికార్జున స్వామిని, స్వామివారి గర్భాలయ త్రిశూలం, కుమారస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ముఖ మండపంలో శ్రీ చక్రానికి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించారు. తరువాత వేదాశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు, శేష వస్త్రాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు అందజేశారు. అనంతరం గోకులంలో వారు గోమాత పూజను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకున్నారు. వారి వెంట రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్ తదితరులు ఉన్నారు.

## సృజనాత్మక ఆలోచనను పెంపొందించుకోవాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి -టాప్ మోడల్ లో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్**




టౌన్‌మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకో వాలని కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి తెలిపారు. శనివారం కర్నూలు లోని స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రారంభించారు. శాస్త్రవేత్త సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, వినూత్న ఆవిష్కర ణలను ఆసక్తిగా పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌ను మొత్తం ఏడు థీమ్స్‌తో నిర్వహించారని తెలిపారు. శాస్త్రీయ ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రశ్నించే మనస్తత్వాన్ని, సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయ ని తెలిపారు. నేడు విద్యార్థులు రూపొందిస్తున్న చిన్న చిన్న ఆవిష్కరణలే రేపటి పెద్ద ఆవిష్కరణలకు పునాది అవుతాయ న్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లోని ప్రతిభను గుర్తించి, వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ నిరక్షరాస్యత ఉందని ఇందుమూలంగానే బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల విజ్ఞాన వికాసానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి, ఎల్. సుధాకర్ జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ అధికారి రంగమ్మ, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ లోకరాజు, ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ డా.ఏ.సిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జెసి నూరుల్ ఖమర్, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం వరకు అధికారులతో కలిసి నడుచుకుంటూ వెళ్లి అక్కడ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సునయన ఆడిటోరియం ఆవరణలో జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ అధికారులతో కలిసి కలెక్టర్ చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం స్పెషల్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ప్రజల నుండి ఎక్కువగా ఏ అంశాల మీద ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో టాయిలెట్స్ సరిగా లేవని, అంగన్వాడీ సెంటర్లలో కిట్లను సరిగా సరఫరా చేయడం లేదని ప్రజల నుండి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్లకు వెల్లడించారు. కలెక్టరేట్ ఎఒ శివరాముడు, పాల్గొన్నారు..



కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

## పేదల ఇళ్ల తొలగింపు ఆలోచనను విరమించుకోవాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్**

**ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్**

కర్నూలు నగరంలో హంద్రీ నది వెంట ముజఫర్ నగర్ గంగావతి నగర్ కన్యకా పరమేశ్వరినగర్ కల్లూరు ప్రాంతాలలో గత 30, 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయమని కల్లూరు తహశీల్దారు నోటీసులు ఇవ్వడం పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ విచారం వ్యక్తం చేశారు. శనివారం ముజఫర్ నగర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో బాధితుల సమావేశం కె.సుధాకరప్ప అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ నగర కార్యదర్శి టి.రాముడు,నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా మాట్లాడుతూ ఎక్కడా నివాసాలు లేక అద్దె ఇంట్లో అద్దెలు చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి అన్ని రకాలు పన్నులు కడుతూ ప్రభుత్వం అందజేసిన సహకారంతో చిన్నపాటి గృహాలు నిర్మించుకొని నివాసముంటున్న పేదల గుడిసెలు బఫర్ జోన్ పేరుతో కల్లూరు తహశీల్దార్ నోటీసులు పంపడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తహశీల్దార్ పేదలకు పట్టాలు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల ద్వారా మంజూరు చేసి మళ్లీ హంద్రీ పోరంబోకు స్థలంలో గృహాలు నిర్మించుకున్నారనే పేరుతో ఎందుకు నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలు ల్యాండ్ మాఫియాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి హంద్రీ నది వెంట ప్లాట్ల రూపంలో వ్యాపారం చేస్తున్న వారి జోలికి వెళ్లకుండా పేదలను ఖాళీ చేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తహశీల్దార్ ఇచ్చిన నోటీసులను ఉపసంహరించు కోకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఎస్.హుస్సేన్ బాష, బి.అయ్యస్వామి, వలిబాష, బి.మధు, మనోహర్, షేక్షావలి, రవి, మౌలాలమ్మ, మరియమ్మ, శ్రీదేవి, లక్ష్మీదేవి, బాధితులు 100 మంది స్థానికులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

## 'ఉపాధి'కి గండం..!

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

నిరుపేదలకు భరోసా కల్పించే విధంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని ప్రజలకు దూరం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడుగులు వేసింది. ఏకంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవక మిషన్ - గ్రామీణ్‌గా పేరు మార్చేసింది. అలాగే గతంలో ఉన్న చట్టంలో అనేక మార్పులు చేస్తూ తీసుకున్న చర్యలు కూడా చట్టాన్ని నిర్వీర్యం వేసేందుకు చర్యలు తీసుకుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టింది. ఇప్పుడు ఈ చట్టాన్ని స్కీముగా మార్చేందుకు అడుగులు వేసింది. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులతో అమలు చేస్తుంది. ఇక నుండి కేంద్రం వాటా 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాట 40 శాతంగా ఖర్చు చేయాలని చట్టంలో మార్పు చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా అనుగుణంగా చూస్తే నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా కింద విడుదల చేసే నిధులను అడపాదడపా విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా నిధులు విడుదల కావడం లేదు. ఇప్పుడు 40 శాతం నిధులు విడుదల చేయాలంటే కష్టతరంగానే మారుతుంది. ఇప్పటికే ఉపాధి కూలీలకు చేసిన పనులకు కూలి డబ్బులు చాలా ఆలస్యంగానే విడుదలవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలు చేసిన పనికి సంబంధించిన కూలి డబ్బుల కోసం వేచి చూడాల్సి ఉంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో నిరుపేదలు ఉపాధి పనులకు వెళ్లి కొంత లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు అది కూడా లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమైంది.

**పరీక్షలపై కొరవడిన పర్యవేక్షణ :** జిల్లాలో రక్తపరీక్షా కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వరం నుంచి శరీరంలో ఏసమస్య వచ్చినా రక్తపరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాతే డాక్టర్లు వైద్యం అందిస్తారు. రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు, వాటి అమలుపై అనేక నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ విధించిన నిబంధనలను రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి రక్త పరీక్షా కేంద్రం వద్దా ఏ టెస్ట్‌కు ఎంత ఫీజు అనేది పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. దాని ప్రకారమే రోగుల నుంచి వసూలు చేయాలి. ఏలూరు పట్టణంతోపాటు, ఏ ఒక్క రక్త పరీక్షా కేంద్రం వద్ద ధరల పట్టిక లేదంటే అతిశయోక్తికాదు. ధరల పట్టికపై రోగులు అడిగినా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. దీంతో రక్త పరీక్షలకు ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారు. ఒకే పరీక్షకు ఒక ల్యాబ్‌లో ఒక ధర, మరో ల్యాబ్‌లో ఇంకో ధర ఉంటుంది. సుగర్ నిర్ధారణ టెస్ట్‌కు ఒకచోట రూ.50 తీసుకుంటే, మరో ల్యాబ్‌లో రూ.వంద, ఇంకో ల్యాబ్‌లో ఇంకోవిధంగా వసూలు చేస్తున్నారు. విటమిన్ డి, బి-12 వంటి పరీక్షలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డెంగీ నిర్ధారణ పరీక్ష ప్రయివేటు ల్యాబ్‌లో చేసే అవకాశం లేదు. కానీ చాలా ల్యాబ్‌ల్లో స్థానిక వైద్యులతో కుమ్మక్కై డెంగీ ఉందంటూ రోగులను భయపెడుతున్న పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రులతో రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఏకమవుతున్నారు. ప్రతి పరీక్షకూ ఆయా ఆసుపత్రులకు పర్సంటేజ్‌ల రూపంలో కమీషన్‌లు ల్యాబ్ నిర్వాహకులు ఇస్తుంటారు. ఈ కమీషన్ 40 నుంచి 50 శాతం వరకూ ఉంటుందని తెలుస్తోంది. దీంతో రోగుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలకు సంబంధించిన ధరల నిర్ణయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు అసలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారవుతోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు సరిగ్గా అమలుకాకపోవడంతో రోగులు భారీ దోపిడీకి గురికావడంతోపాటు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**అవీ..ఇవీ..అన్నీ..**

బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి చేస్తున్న కుట్రలను వ్యతిరేకిస్తూ గాంధీ విగ్రహం ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయనకు నివాళులు అర్పించారు.






మురుగు గుంటలను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు, స్థానికులు

## సచివాలయం సమీపంలో మురుగునీటి గుంటలు

**-స్పందించని అధికారులు, పాలకవర్గం**

**-అవగాహన లేకుండా భవన నిర్మాణాలకు అనుమతులు**

**-50 ఏళ్లుగా లేని మురుగునీటి గుంతలు కొత్తగా ఏర్పడడానికి అధికారులే కారణం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగరం నడిబొడ్డులో ఉన్న కృష్ణారెడ్డి నగర్ సచివాలయం సమీపంలో మురుగు నీరు నిలిచి చెరువు లాగా తయారై దుర్వాసన దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానిక మెకానికులు వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం బృందం స్థానికులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా మెకానికల రంగం ప్రతినిధి ఎం.రత్నం, పి.కన్నా దేశాయ్,పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎం.నాగరాజు, ఇరిగినేని. పుల్లారెడ్డి, కాజాబాష, ఎ. రవీంద్ర వరకుమార్ మాట్లాడుతూ 50 ఏళ్ల లేని మురుగు నీటి గుంతలు ఇప్పుడే ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారన్నారు. మురుగునీరు వెళ్లేందుకు దారితో పాటు రోడ్లు ఉన్నాయా లేదా అనేటువంటి ఆలోచించకుండా అవగాహన లేకుండా భవన నిర్మాణాలకు అధికారులు అనుమతి ఇవ్వడం, బిల్డర్లు నామ్‌కె వస్తే అనే చందంగా మురుగు కాలువలు నిర్మించి చేతులు దులుపుకోవడంతో మురుగు నీటి చెరువు ఏర్పడిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతం కంటే హీనంగా మురుగునీరు చేరి చెరువుల తయారై ప్రజలు నరకం అనుభవిస్తున్నా.. అధికారులు, పాలకవర్గం స్పందించడం లేదని విమర్శించారు. ఇంటి పన్నులు పెంచడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారం పై అధికారులకు లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో ఎండి. యూనూస్, సివి.వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.షాహిద్, ఈ లక్ష్మణ గౌడు, పి. మురళీమోహన్, సి. శ్రీరాములు, ఎం.నారాయణ పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పేర్కొన్నారు. శనివారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడేందుకునేందుకు చిన్నారులకు రెండు పోలియో తప్పని సరిగా వేయించాలన్నారు.వైద్యులు నందిని, ప్రతిభ, భువనతేజ, సామజిక ఆరోగ్య అధికారి రాధామోహన్, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు ప్రభాకర్ రెడ్డి, అనమ్మ, ఎస్తేర్‌రాణి , వైద్య సిబ్బంది , ప్రోజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు రద్దు చేయాలి

### కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నిరసన

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు 2025' ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో నగర కార్యదర్శి అంజి అధ్యక్షతన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప మాట్లాడుతూ గతంలో 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (హెచ్ఇసిఐ) బిల్లును ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుతో మార్చి యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. యుజెసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థల స్థానంలో హెచ్ఇసిఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యమన్నారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం , ఆర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యా రంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి , మతతత్వీకరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ వికృత ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నమే ఈ చర్య అని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం వల్ల భారతదేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు , పనితీరులో భారీ మార్పులు వస్తాయి, ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. యుజిసిని రద్దు చేయడం వల్ల వృత్తి విద్యా కోర్సులు లేని ఉన్నత విద్యా సంస్థల గొంతు నులిమినట్లవుతుందన్నారు. ఇక్కడ నిధులు 'గ్రాంట్స్' (అనుదానాలు) నుండి 'లోన్ సర్వీసింగ్'(అప్పులు) కు మారుతాయి, దీనివల్ల విద్య అనేది కేవలం ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే ఖరీదైన వస్తువుగా మారుతుందనీ తెలిపారు. ప్రజలు, మేధావులు , విద్యార్థి సంఘాల నుండి వచ్చిన తీవ్ర విమర్శలను బేఖాతరు చేస్తూ ఈ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని సూచిస్తుందన్నారు. రాష్ట్రాలలోని విద్యా సంస్థలపై కేంద్రం తన భావజాలాన్ని రుద్దడానికి , వాటిపై పట్టు సాధించడానికి ఈ మార్పును ఒక సాధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. హెచ్ఇసిఐ నిర్మాణం కూడా ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఇందులో 12 మంది సభ్యులలో 9 మందిని కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుందని, ఇది తక్కువ ప్రభుత్వం, ఎక్కువ పాలన" (less government, more governance) అనే సూత్రానికి విరుద్ధమన్నారు. అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లో ఉంచుకుని, తన భావజాల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యా రంగాన్ని నడపడానికి ఇది ఒక యంత్రాంగంగా మారుతుందన్నారు. హెచ్ఇసిఐ బిల్లు 2025 అనేది రాజ్యాంగ విరుద్ధమైన చర్య, ఇది సమాఖ్య స్ఫూర్తికి , విద్యా రంగం కలిగి ఉన్న సమగ్ర దృక్పథానికి నేరుగా ముప్పు వస్తుందని చెప్పారు. ఈ బిల్లు ప్రభావం నేరుగా వెనుకబడిన , అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు , కుటుంబాలపై పడుతుందన్నారు. ఈ బిల్లు అమలు వల్ల విద్య అనేది డబ్బున్న వారు కొనుగోలు చేసే వస్తువుగా మారుతుందని, ఆర్థికంగా వెనుకబడిన వారిని విద్యకు దూరం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఈ ఏకపక్ష చర్యను తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. విద్యార్థి లోకం , సామాన్య ప్రజలు ఈ బిల్లును వ్యతిరేకించాలని , పెద్ద ఎత్తున ఈ చర్యను నిరోధించాలని మేము కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు పృథ్వీ, నాయకులు చరణ్, నదీమ్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.




కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## 22న ఎన్ఆర్ఇజిఎస్ మార్పును వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసన

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్పునలకు వ్యతిరేకంగా ఈనెల 22న వామపక్షపార్టీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య , సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవ పార్లమెంటులో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని పథకంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 22న నియోజకవర్గ కేంద్రాల్లో వామపక్షాలు చేపట్టే నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రజలు పాల్గొనాలని కోరారు. మోడీ ప్రభుత్వం 80శాతం మంది గ్రామీణ పేదల ప్రజలకు ఉపాధి లేకుండా చేస్తుందని తెలిపారు. అందుకోసమే జాతీయ గ్రామీణ ఉపాధి చట్ట మార్పును వ్యతిరేకిస్తూ జరిగే ఉద్యమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ నిరసన

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలపై తీసుకువచ్చిన వికసిత్ భారత్ విద్యా అధిష్ఠాన బిల్లును వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందు నిరసన తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రామకష్ణ మాట్లాడుతూ ఈ బిల్లు దేశంలోని విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీయడమే కాకుండా, విద్యా రంగాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకెళ్లే ప్రమాదం కలిగిస్తోందన్నారు. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.వెంటనే వికసిత్ భారత్ విద్యా అధిష్ఠాన బిల్లు 2025 ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు సందీప్ నాయక్, ఓబులేసు, సందీప్, అశోక్, మనోహర్, భరత్, వేణు, ప్రతాప్, కేశవ, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రపంచ గుర్తింపు

**-ఘనంగా రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం**

**-17 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు హాజరు**

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

ప్రతిభ చూపిన క్రీడాకారులకే ప్రపంచ వ్యాప్తంగా అధిక గుర్తింపు ఉందని కర్నూలు నగర కార్పొరేటర్లు నారాయణరెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు అవుట్డోర్ స్టేడియం నందు 44వ రాష్ట్రస్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల షూటింగ్ బాల్ పోటీలను రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి జోసఫ్, కర్నూలు జిల్లా ఒలంపిక్స్ సంఘం సిఇఒ విజయ్ కుమార్, సెపక్తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్స్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్, కెవి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కెడిసిసి మాజీ డైరెక్టర్ రమణారెడ్డి, యువ నాయకుడు హనుమంతు రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో తమకు నచ్చిన క్రీడలో అంకితభావంతో సాధన చేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. వివిధ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులలో స్నేహభావం పెంపొందింటుందన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దడం తోపాటు పతకాలు సాధించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది అన్నారు. రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ మాట్లాడుతూ 17 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పోటీలకు హాజరైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి మొదటి వారంలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అంతకుముందు అతిథులకు క్రీడాకారులు కవాతు నిర్వహించి గౌరవ వందనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం ప్రతినిధులు రత్నం, సురేంద్ర పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి

## కొనుగోలుదారులు జాగ్రత్తలు పాటించాలి

**- జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి కరణం కిశోర్ కుమార్**

**ప్రజాశక్తి - ఆదోని**

వస్తువులు, సామగ్రి, తినుబండారాల కొన్నప్పుడు ఎంఆర్‌పి ధర, తయారీ చేసిన డేట్ గమనించాలని జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి కరణం కిశోర్ కుమార్ సూచించారు. శనివారం ఆదోనిలోని అక్షరశ్రీ కళాశాలలో వినియో గదారుల రక్షణ మండలి డివిజన్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు ఈసా బాష ఆధ్వ ర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాల నుంచి ఎస్‌కెడి కాలనీ, పశువుల ఆస్పత్రి, భీమాస్ సర్కిల్ మీదుగా ప్లకార్డులు చేతపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వినియోగదారుల చట్టాన్ని విద్యార్థులకు వివరిస్తూ చట్టాన్ని తమ హక్కుగా వినియోగించుకోవాలని జిల్లా జడ్జి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ... వస్తువు, సామగ్రి కొనుగోలు జరిగిన సమయంలో తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. కొన్న వస్తువు, సామగ్రిలో నాణ్యత లేకపోయి నా, పని చేయకపోయినా కన్స్యూమర్ కోర్టులో విక్రయదారునిపై కేసు వేసి పరిహారం పొందే వెసలుబాటు ఉందని తెలిపారు. ఎవరూ నష్టపోకుండా చూడడమే కన్స్యూమర్ ఫోరం ఉద్దేశమన్నారు. తహశీల్దార్ శేషఫణి, ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## 'మౌలిక సదుపాయాలు కల్పించాలి'


రాస్తారోకో చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి - దేవనకొండ**

దేవనకొండ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజావసరాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.మహేంద్ర, కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పరిశుభ్రత పాటించాలని శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు జిఎన్ఆర్.నాగేంద్ర అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ... కర్నూలు, పత్తికొండ, గుంతకల్లు రూట్‌లో అత్యంత రద్దీగా ఉండి ఆర్‌టిసికి మంచి ఆదాయాన్ని సమకూరుస్తున్న దేవనకొండలోని బస్టాండ్ పట్ల ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. బస్టాండ్‌లో అపరిశుభ్రత రాజ్యమేలుతోందని, ప్రయాణికులు కనీసం కూర్చోవడానికి కూడా వీలుగా లేదని వాపోయారు. చెత్తాచెదారం, దుర్గంధంతో బస్టాండ్ ఆవరణ ఉంటుందని, బస్టాండ్ లోపలికి పోవడానికి కూడా ప్రయివేట్ వాహనాలు అడ్డంగా పెడుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. బస్టాండ్ కూడా ఆక్రమణకు గురవుతోందని, ఆర్‌టిసి అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బస్టాండ్‌లో అటెండర్‌ను నియమించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్, రైతుసంఘం మండల కార్యదర్శి సూరి సంఘీభావం ప్రకటించారు. డివైఎఫ్ఐ నాయకులు అనిల్ కుమార్, వీరేంద్ర నాయుడు, నాగేంద్ర, బాష, సుధాకర్, రవీంద్ర పాల్గొన్నారు.

## 4.960 కిలోల గంజాయి స్వాధీనం

**- డీఎస్పీ వెంకట్రామయ్య**

**ప్రజాశక్తి-ఆలూరు**


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామ పరిధిలోని పంట పొలాల్లో సాగు చేసిన గంజాయి మొక్కలను (4.960 కిలోలు) స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. శనివారం ఆలూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేగులపాడు గ్రామానికి చెందిన రైతు ఉనేబాద్ శివయ్య అదే గ్రామానికి చెందిన సర్వే నెంబరు 176 ఆంజనేయ స్వామి మాన్యంలో, సర్వే నెంబరు 173 ముల్లా మహజిత్ ఇనామ్ భూమిలో కంది, మిరప పంటలో 300 గంజాయి మొక్కలను పెంచి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. సమాచారం మేరకు ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, ఎడిఎ చెంగల్ రాయుడు, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ వెళ్లి పంట పొలాలను పరిశీలించారని చెప్పారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకొంటామని తెలిపారు.

# 'ఉపాధి' పేరు మార్చడం తగదు

**- కార్మిక, ప్రజాసంఘాల నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం తగదని, చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌.డి.అంజి బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న మాట్లాడారు. చట్టంగా ఉన్నప్పుడే అనేక నిబంధనలు పెట్టి ఉపాధి కూలీలను ఇబ్బందులకు గురి చేశారని, స్కీంగా మారిన మరుక్షణమే కూలీలకు ఉపాధి పనిని దూరం చేసే అవకాశం ఉందని తెలిపారు. తక్షణమే కొత్త బిల్లును రద్దు చేయాలని, లేకపోతే కూలీలను సమీకరించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.గోపాల్, తిప్పన్న, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, సిఐటియు నాయకులు వెంకటేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప పాల్గొన్నారు. **గోనెగండ్ల** తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తహశీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు నాయకులు నబి రసూల్, కెవిపిఎస్ నాయకులు కరుణాకర్, రైతుసంఘం నాయకులు హనుమంతు, బీఎస్పీ నాయకులు బంగారప్ప, వ్యవసాయ కూలీలు మునెప్ప, హనుమంతు పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షతన ధర్నా చేపట్టారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగడు, అశోక్, రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, సీనియర్ నాయకులు యూసుఫ్ బాషా, బజారి, కెపి.రాముడు, గాజుల శ్రీనివాసులు, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, శ్రీనివాసులు, కెవి.నాగేంద్ర, సుధాకర్, రవీంద్ర, వీరేంద్ర, నాయుడు, జిఎన్ఆర్.నాగేంద్ర, అనిల్ కుమార్, లక్ష్మి రెడ్డి, ఏలియా, రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ బేగంకు వినతి పత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణస్వామి, సిఐటియు మండల నాయకులు శేఖర్, విఠల్, నాగరాజు, వీరేష్, వ్యకాస నాయకులు రామాంజి, నరసింహ, విశ్వనాథ్, రైతు సంఘం నాయకులు ముసానహళ్లి వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** గాంధీ విగ్రహం ముందు సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన చేపట్టారు. రాముడు అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, ప్రజా సంఘాల నాయకులు సురేష్, రమేష్, కృష్ణ, లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, ఆటో యూనియన్ రాజు, నామాల రాముడు, సుభాన్, రాఘవరెడ్డి, పులి రాజు, గోపాల్ పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యకాస, రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, రైతు సంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, వ్యకాస నాయకులు చిన్న వీరన్న, నరేంద్ర, రాజేష్, గురు స్వామి, శివ పాల్గొన్నారు. **నందవరం** మండల పరిషత్ కార్యాలయం ఎదుట రైతుసంఘం నాయకులు దేవపుత్ర, స్వామిదాసు రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ ఎంపిడిఒ రామచంద్రరావుకు వినతిపత్రం అందించారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు గౌరవాధ్యక్షులు జయరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.వీరేష్, అధ్యక్షులు కె.యోగప్ప, వ్యకాస మండల నాయకులు టి.లక్ష్మన్న, టి.ప్రాజేష్, కెవిపిఎస్ నాయకులు బి.అనిల్ పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ లక్ష్మీ నారాయణకు వినతి పత్రం అందించారు. వ్యకాస నాయకులు కృష్ణ, సిఐటియు నాయకులు ప్రేమ్ రాజ్, ధనుంజయ్, బొజ్జప్ప పాల్గొన్నారు.


నందవరం


ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్న నాయకులు


గోనెగండ్లలో...


దేవనకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆలూరు


ఎమ్మిగనూరు


ఆస్పరి

### మండగిరి, సాదాపురం గ్రామాలను

# మున్సిపాలిటీలో విలీనం చేయాలి

**- కౌన్సిలర్ల విమర్శ**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని మున్సిపాలిటీలో మండగిరి, సాదాపురం గ్రామాలను విలీనం చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు కోసం ప్రత్యేక నిధులు తెప్పించడంలో ఎమ్మెల్యే పార్థసారథి విఫలం చెందారని కౌన్సిలర్ సందీప్ రెడ్డి విమర్శించారు. పట్టణాభివృద్ధికి వినియోగించాల్సిన జనరల్ ఫండ్‌ను ఢణాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు వినియోగించడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని కౌన్సిలర్ బాలాజీ తెలిపారు. మున్సిపాలిటీ నిధులతో మరమ్మతులు జరుగుతున్నా.. సిఎం ప్రత్యేకంగా నిధులు ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపినా మాటమాత్రం చెప్పకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కౌన్సిలర్లపై నింద వేయడం మానుకోవాలన్నారు. ఆదోని అభివృద్ధికి సిఎం చంద్రబాబును కలిసి నిధులు అడుగుదామని చెప్పిన ఎమ్మెల్సీ బీటీ.నాయుడు మాట మరిచారన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా బీటీ.నాయుడు నియామకం వల్ల అభివృద్ధి జరుగుతుందని ఆశించినా ఇంతవరకు ఎలాంటి మార్పు రాకపోవడం వల్ల ప్రజలు నిరాశకు గురవుతున్నారని తెలిపారు. మండగిరి, సాదాపురం గ్రామాలు పట్టణాన్ని ఆనుకుని ఉన్నాయని, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలు సక్రమంగా అందాలంటే మున్సిపాలిటీలో విలీనం చేయాలని, తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కౌన్సిలర్ సందీప్ రెడ్డి ప్రతిపాదన చేశారు. పట్టణంలోని ఒకటో వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్ పార్వతి తెలిపారు. ఆదోనిలో దశాబ్ద కాలంగా కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేస్తున్నారని, ఎందుకు టెండర్లలో పాల్గొనడం లేదో తేల్చాలని కౌన్సిలర్లు అధికారులను డిమాండ్ చేశారు. గుంతకల్లుకు చెందిన ఓ కాంట్రాక్టర్ అన్ని పనులూ దక్కించుకున్నట్లు అజెండాలో రూపొందించారని, ఆదోని కాంట్రాక్టర్లు ఎవరూ లేరా అని కౌన్సిలర్ సందీప్ రెడ్డి నిలదీశారు. కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లను ఇబ్బందులు గురి చేయడం, పనులు చేపట్టేందుకు ముందుకు రాకుండా చేయడం ఆదోనిలో ఎప్పుడూ జరగలేదని, మంచి పద్ధతి కాదని కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ప్రక్రియ వల్ల టెండర్ వేశారని కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ చెప్పారు. ఆదోనిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటిని గాలికొదిలి దుకాణదారులపై జరిమానాలు విధించే పనిలో హెల్త్ ఆఫీసర్ నిమగ్నమయ్యారని కౌన్సిలర్ బాలాజీ మండిపడ్డారు. ప్రణాళిక బద్ధంగా ఆదోని పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని ఛైర్మన్ లోకేశ్వరి తెలిపారు. వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు ఫయాజ్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మీదేవి, కీర్తన, లక్ష్మీ, శాంత, ఉస్మాన్, ఇంతియాజ్, చలపతి, అసిస్టెంట్ కమిషనర్ నిసార్ అహ్మద్, డిప్యూటీ డిఇలు రామమూర్తి, రాజశేఖర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్ సందీప్ రెడ్డి

# పోలీసు శిక్షణకు సిద్ధమైన కుమారులు

**- హఠాత్తుగా మృతి చెందిన తండ్రి**
**- శోకసంద్రంలో కుటుంబం**
**- విశ్రాంత ఎస్ఐ షరీఫ్ మృతి**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**


షరీఫ్ (ఫైల్)

**తండ్రి స్ఫూర్తితో పోలీసు ఉద్యోగం సాధించిన కుమారులు శిక్షణకు సిద్ధమయ్యారు. ఇంతలో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. బరువెక్కిన హృదయాలతో తండ్రికి అంత్యక్రియలు పూర్తి చేసి కుమారులిద్దరూ శిక్షణకు బయల్దేరి వెళ్లారు. ఈ హృదయవిదారకర సంఘటన గోనెగండ్లలో చోటుసుకుంది.**

గోనెగండ్ల గ్రామానికి చెందిన అచ్చుగట్ల షరీఫ్ (66) సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. షరీఫ్ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై కర్నూలు, నంద్యాల ప్రాంతాల్లో సేవలందించి ఎస్ఐగా విరమణ పొందారు. ఆయన ప్రోత్సాహం, స్ఫూర్తితో ఆయన కుమారులు హసన్ వలీ, హుస్సేన్ వలీ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీసు ఎంపిక పరీక్షల్లో ఎపిఎస్‌పి కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించారు. మంగళగిరిలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై నియామక పత్రాలు కూడా అందుకున్నారు. పోలీసు ఉద్యోగాలు సాధించిన మండలంలోని వివిధ గ్రామాల్లోని 25 మందికి కొద్దిరోజుల క్రితం గోనెగండ్ల హైస్కూల్‌లో సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న షరీఫ్ ఆనందంతో అభ్యర్థులందరూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత తన ఇంట్లో విందును ఏర్పాటు చేస్తానని, అందరూ హాజరు కావాలని కోరారు. షరీఫ్ కుమారులు శిక్షణకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం కర్నూలులో రిపోర్టు చేసి అక్కడి నుంచి ఒక కుమారుడు కడపకు, మరో కుమారుడు మంగళగిరికి పోలీసు శిక్షణకు వెళ్లాల్సి ఉంది. షరీఫ్ శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందారు. సంతోషంగా శిక్షణకు బయల్దేరుదామనుకున్న ఆయన కుమారుల హృదయాలు కన్నీటితో బరువెక్కాయి. శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. తండ్రి మరణించిన బాధను ఓర్చుకుంటూనే ఉద్యోగ శిక్షణలో చేరడానికి ఆ కుమారులు బయల్దేరి వెళ్లారు.







# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


**- మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ**

**ప్రజాశక్తి - ఆదోని**

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ తెలిపారు. 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'లో భాగంగా శనివారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భీమాస్ సర్కిల్ వరకు ప్రదర్శనగా చేరుకొని మానవహారం నిర్వహించారు. పర్యావరణం పట్ల బాధ్యతగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది తినుబండారాలపై వాలి రోగాల వ్యాప్తికి కారణమవుతాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో చేరి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ డస్ట్ బిన్లు ఉపయోగించి ప్లాస్టిక్ నిషేధం పాటించాలని కోరారు. **నందవరం** మండలంలోని నాగలదిన్నె గ్రామంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపిడిఒ పుల్లయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బాలకృష్ణ, ఎటిఎం రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి నౌసన్న, గ్రామ పెద్దలు జబ్బర్, ఈరన్న, తిమ్మప్ప పాల్గొన్నారు. **ఆస్పరి** మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా పురవీధుల గుండా సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో ఎంపిడిఒ గీతావాణి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ విజయభాను, పంచాయతీ కార్యదర్శి విజయ రాజు పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న ఛైర్మన్ లోకేశ్వరి


నందవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


ఆస్పరిలో


# నాటుసారా నివారణకు సహకరించాలి

**- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు**

**ప్రజాశక్తి - ఆదోని**

నాటుసారా రహిత సమాజం కోసం సహకరించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు కోరారు. శనివారం ఆదోనిలోని ఓ హాలులో డిఆర్‌డిఎ, బ్యాంకు అధికారులు, మెప్మా, నాటుసారా తయారీ దారులతో ఆదోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడారు. నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమన్నారు. నాటుసారా సేవించి చాలామంది మృత్యువాత పడ్డారన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నాటు సారా తయారీదారులు నివసించే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. నాటుసారా తయారీ మానుకున్నా, పాత నేరస్తులను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి జీవనోపాధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఆటోలు, కూరగాయల విక్రయం, టీస్టాల్, కుటీర పరిశ్రమ వంటి వాటికి బ్యాంకు ద్వారా ఆర్థిక రుణ సహాయం చేయించి వారి కుటుంబానికి ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలూరు, కోసిగి ఎక్సైజ్ సిఐలు, మెప్మా కోఆర్డినేటర్ వీరా రెడ్డి, జావేద్, డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుధీర్ బాబు


చెత్త బండ్లను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

## చెత్త సేకరణ ట్రై సైకిళ్లు పంపిణీ


**ప్రజాశక్తి - ఆస్పరి**

మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను సేకరించేందుకు రెండు ట్రై సైకిళ్ళు, ఎనిమిది డబ్బాలు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ గీతావాణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొదటి విడతలో కైరుప్పలకు 3, చిన్నహోతూరుకు 2, డి.కోటకొండ గ్రామానికి ఒకటి చొప్పున చెత్త ట్రై సైకిళ్లు వచ్చాయని తెలిపారు. మిగిలిన గ్రామాలకు కూడా చెత్త బండ్లు త్వరలో వస్తాయని చెప్పారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఇంటి దగ్గరికి చెత్తబండ్లు వచ్చి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డిప్యూటీ ఎంపిడిఒ విజయ భాను, పంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు.

## 'జిల్లా'పై నిర్లక్ష్యం తగదు

**- కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**


రాజీనామా పత్రాన్ని ఇస్తున్న రఘునాథ్‌రెడ్డి

ఆదోని జిల్లా ఏర్పాటు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభించడం సమంజసం కాదంటూ వైసిపి నాయకులు, 5వ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి విమర్శించారు. ఆదోని జిల్లా సాధన ఉద్యమంలో భాగంగా తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా సాధనతోనే ఆదోని అభివృద్ధి సాధ్యమనే భావన అందరిలోనూ ఉందన్నారు. వారి ఉద్యమానికి మరింత బాసటగా నిలవాలన్న ఉద్దేశంతోనే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశానని, ఆమోదించాలని ఛైర్మన్‌ను, కమిషనర్ కృష్ణను కోరారు. రఘు నాథ్ రెడ్డి రాజీనామా చేయడం పట్ల ఆదోని ఉద్యమ కారులు అభినందనలు తెలిపారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉద్యమాన్ని గుర్తించాలని జెఎసి నాయకులు విజ్ఞప్తి చేశారు.

## అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

**ప్రజాశక్తి - కౌతాళం** : సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు కోరారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కన్వీనర్‌గా నాగరాజు, మరో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## ఆదోనిని జిల్లా చేసే వరకు ఉద్యమం

**- జనసేన చిప్పగిరి మండల కన్వీనర్ చిరంజీవి**


**ప్రజాశక్తి - చిప్పగిరి** : ఆదోనిని జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమిస్తామని, అందుకు జనసేన పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని జనసేన చిప్పగిరి మండల కన్వీనర్ కె.చిరంజీవి తెలిపారు. శనివారం ఆదోని జిల్లా చేయాలని ఆలూరులో చేపట్టిన దీక్షలు 9వ రోజుకు చేరాయి. జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప ఆదేశాల మేరకు జనసేన కోఆర్డినేటర్ రంజిత్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నుంచి ఆరు మండలాల అధ్యక్షులు మద్దతు తెలిపారు. జనసేన హాలహర్వి మండల అధ్యక్షులు చంద్ర, ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ సరోజమ్మ, ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న చిరంజీవి

## రాఘవేంద్రుని సన్నిధిలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథ్ జానకిరామన్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్ స్వాగతం పలికారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. ఎస్‌బిఐ మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న జానకిరామన్

# జి రాం జి బిల్లును రద్దు చేయాలి

- ఈ నెల 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఉపాధి హామీ చట్టం ఊపిరి తీసే జి రాం జి బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు టి.రమేష్ కుమార్, బాబా ఫక్రుద్దీన్, టి.రామచంద్రుడు, మురళి, శ్రీను, నరసింహ నాయక్, బాలవెంకట్, లక్ష్మీదేవి, మార్క్స్, ఎంఆర్ నాయక్, శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. వామపక్షాల పోరాటంతో గతంలో యుపిఏ ప్రభుత్వంలో ఈ ఉపాధి చట్టాన్ని సాధించామని, దీని వల్ల పేదల జీవితాలు కొంతైనా మెరుగుపడ్డాయని తెలిపారు. ఇతర పనులకు కూడా ఈ చట్టం వల్ల కూలి పెరిగిందని చెప్పారు. అటువంటి ఉపాధి హామీ చట్టం ఊపిరిని తీసే పద్ధతిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్వీర్యం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. నిధులు తగ్గించడం, యంత్రాలు ఉపయోగించడం, నిధులను పక్కదారి మళ్ళించడం లాంటి అనేకం చేసిందన్నారు. 100 రోజుల పని గ్యారెంటీ పథకంగా ఉన్నా 40 రోజులకు మించి ఎక్కడా పని చూపించడం లేదన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఈ ఉపాధి చట్టానికి జి రాం జీ పేరుతో కొత్త బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకోవడం దారుణమన్నారు. ప్రతిపక్షాల నిరసనలు సైతం లెక్కచేయకుండా వారి గొంతును నొక్కారన్నారు. ఈ బిల్లులో పేరుకు వంద రోజుల నుంచి 125 రోజుల వరకు పని దినాలు పెంచుతామని చెప్పినా గత అనుభవం రీత్యా ఎక్కడ 40 రోజుల పని కూడా జరిగిన పాపాన పోలేదన్నారు. రోజులు పెంచినా కేంద్రం నిధులు మాత్రం పెంచలేదన్నారు. మరోవైపు గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్ర వాటా పది శాతంగా ఉండగా ప్రస్తుతం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటాగా నిర్ణయించిందన్నారు. 10 శాతం వాటా కూడా గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు కట్టలేని పరిస్థితిలో ఉండగా 40 శాతం పెంచడం వల్ల ఇక భవిష్యత్తులో రాష్ట్ర వాటా ఇవ్వరన్నారు. రాష్ట్రం నిధులు ఇవ్వలేదని కేంద్రం కూడా నిధులు ఇవ్వకుండా ఈ పథకాన్ని నీరు గార్చేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఈ బిల్లు ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే పద్ధతిలో ఉందని, వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని ఈ నెల 22న కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్


లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## అనంత డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి యూనిట్ మంజూరు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి యూనిట్ మంజూరు చేయడం పట్ల అనంత కళాశాల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అనంత డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సిసి రైజింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ హాజరయ్యారు. కళాశాలలో ఎన్‌సిసికి ఎంపికైన 10 మంది బాలురు, 7 మంది బాలికలను లెఫ్టినెంట్ కల్నల్ శశి కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి ద్వారా లభించే అవకాశాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశసేవలో యువత పాత్రపై అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. అనంత విద్యా సంస్థల అధినేత రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ అనంత డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి యూనిట్ మంజూరు కావడం ఎంతో గర్వకారణమన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంత విద్యా సంస్థల చైర్మన్ విజయలక్ష్మి, డిగ్రీ ప్రిన్సిపల్ నరసింహులు, ఇంటర్ ప్రిన్సిపల్ శంకరాచారి, ఎన్‌సిసి సిటిఒ ఆదిత్యతో పాటు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## డిఎంహెచ్ఓ, వైద్యులపై ఆర్‌డి విచారణ

**ప్రజాశక్తి - చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు అంజలి రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదు మేరకు శనివారం వైద్య ఆరోగ్య శాఖ కడప రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య విచారణ చేపట్టారు. వైద్యులు ఇమ్రాన్, అంజలిలను పలు అంశాలపై నివేదికలు స్వీకరించారు. అనంతరం ఇరువురిని వేర్వేరుగా వారి మధ్య ఉన్న విభేదాలు, నిధుల దుర్వినియోగం, మనస్పర్థలు పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఇటీవల స్థానిక ఎంపిపిపై జడ్పీ సిఈఓ జరిపిన నివేదికలను కూడా తీసుకుని, నంద్యాలకు డిఎంహెచ్ఓపై విచారణ చేపట్టి నివేదికలను రాష్ట్ర డైరెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈ విచారణలో జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, హెల్త్ సూపర్‌రైజర్ రామలింగారెడ్డి, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామగిడ్డయ్య

# పర్యావరణ పరిరక్షణకు కృషి : మంత్రి బీసీ

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పర్యావరణాన్ని పరిరక్షించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంద కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పరిసరాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను, డ్వాక్రా సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను, ప్రకృతి వ్యవసాయ మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహితంగా రాష్ట్రాన్ని మార్చాలన్న ఆలోచనలో భాగంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లెను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కంకణం కట్టుకుని పని చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ బనగానపల్లె లక్ష్యంగా ఏడాదికాలంగా బీసీ ఇందిరా రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ బనగానపల్లెలో చాలాచోట్ల ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్నారని, ప్లాస్టిక్‌ను వినియోగించోద్దని వారికి బీసీ ఇందిరా రెడ్డి మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. మంచి గాలి, వాతావరణం కోసం బనగానపల్లె పట్టణంలో చెట్లను నాటినట్లు చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లాస్టిక్‌పై సమాజంలో మరింత అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల్లో మార్పు వస్తే ప్లాస్టిక్‌ని పూర్తిగా తరిమివేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డిఇ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, ఎంఈఓ స్వరూప, ఏఒ సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో బాల ఆంజనేయులు, వెలుగు ఏపిఎం హజరత్, ఎస్ఆర్‌ఈజీఎస్ ఏపీవో రమణ, గ్రామ పంచాయతీ ఈవో సతీష్ కుమార్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సహకార సంఘం అధ్యక్షులు అత్తార్ అబ్దుల్ కలాం, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసీం బాబు, నాయకులు అల్తాఫ్ హుస్సేన్, అత్తార్ అను, సయ్యద్ హుస్సేన్ నియాజీ, బొబ్బల మద్దిలేటి రెడ్డి, సంగు శంకర్ రెడ్డి, మీరాపురం నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి


షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న బిసి రాజారెడ్డి

## క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

**ప్రజాశక్తి - బనగానపల్లె :** క్రీడల వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పెండేకంటి వెంకట సుబ్బయ్య ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. కే.ఈ. బీసీ బాల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బిసి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. బిసి రాజారెడ్డి పోటీలను ప్రారంభించి కొద్దిసేపు షటిల్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లెలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తమ సోదరుడు బిసి బాల తిమ్మారెడ్డికి షటిల్ బ్యాడ్మింటన్ ఆట అంటే ఇష్టమని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ స్థాయిలో షటిల్ ఆటకు గుర్తింపు ఉందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 85 టీంలు పోటీలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల పోటీల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్తాఫ్ హుస్సేన్, భానుముక్కల సొసైటీ చైర్మన్ కలాం, జెడ్‌వి.కృష్ణారెడ్డి, బొబ్బల మద్దిలేటి రెడ్డి, మోయిన్ శంకరయ్య, డాక్టర్ ఎంసిహెచ్.బిచ్చయ్య, సుబ్రహ్మణ్యం, నెహ్రూ స్కూల్ డైరెక్టర్ రవితేజ రెడ్డి, మధు, ఇస్మాయిల్ ఖాన్, మోహన్ రెడ్డి, మక్బూల్, పుల్లయ్య, బండి హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, సతీష్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌బిసి కాలువలో పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - బనగానపల్లె :** మండలంలోని పండ్లాపురం గ్రామ సమీపంలో ఎస్ఆర్‌బిసి కాలువలో పడి పలుకూరు గ్రామానికి చెందిన జేజాల విశ్వనాథ ఆచారి (70) మృతి చెందినట్లు నందివర్గ పోలీసులు శనివారం తెలిపారు. పండ్లాపురం గ్రామ సమీపంలో ఎస్ఆర్‌బిసి కాలువలో మృతదేహం ఉందని గ్రామ ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పండ్లాపురం వీఆర్‌ఏ గోపాలుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'ముస్తాబు' కార్యక్రమాన్ని డిఇఒ తనిఖీ

**ప్రజాశక్తి - శిరివెళ్ల :** శిరివెళ్ల మండల కేంద్రంలోని రుద్రవరం రాస్తా పక్కన గల ఆదర్శ పాఠశాలలో శనివారం జరిగిన ముస్తాబు కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు పాఠశాలకు చక్కగా ముస్తాబై రావాలనే లక్ష్యంతో ప్రిన్సిపల్ డాక్టర్ ఇస్రాత్ బేగం అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించి, బూట్లు వేసుకొని శుభ్రంగా, క్రమబద్ధంగా పాఠశాలకు హాజరవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. బాలురు బెల్ట్ ఇన్‌షర్ట్‌తో తల చక్కగా దువ్వుకొని పాఠశాలకు రావాలని, బాలికలు రెండు జడలు వేసుకొని బ్లాక్ రిబ్బన్లు ధరించాలని సూచించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. టాయిలెట్స్‌కు వెళ్లి వచ్చిన తర్వాత తప్పనిసరిగా చేతులు లిక్విడ్ హ్యాండ్‌వాష్‌తో శుభ్రం చేసుకునేందుకు ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకర్ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి నాగార్జున రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ

# బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షో ప్రారంభం

- ఈ నెల 28 వ తేదీ వరకు జ్యువెలరీ, ఆభరణాల ఆఫర్లు
- కస్టమర్లతో బ్రైడ్స్ అఫ్ ఇండియా బ్రోచర్ లాంచింగ్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

విభిన్నమైన భారత దేశ వివాహ వారసత్వాన్ని వేడుక చేసుకుంటూ శనివారం బ్రైడ్స్ అఫ్ ఇండియా 15వ ఎడిషన్ ప్రచారాన్ని మలబార్ గోల్డ్ డైమాండ్స్ తన కస్టమర్లతో ఘనంగా ఆవిష్కరించింది. మలబార్ గోల్డ్ డైమండ్స్ నంద్యాల షోరూం ప్రతిష్టాత్మకమైన అఫ్ ఇండియా షోను అద్భుతమైన బంగారం, రత్నాలు వజ్రాభరణాల ప్రత్యేకమైన కలెక్షన్లతో ఈ నెల 20 నుండి 28 వరకు ఆఫర్లు ఇవ్వడంతో పాటు ప్రతి ఆభరణంపై 30 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు మల బార్ గోల్డ్, డైమండ్స్ మేనేజర్ సుధాకర్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 18 వరకు వివాహ ఆభరణాలపై క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శన సందర్భంగా కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించినట్లు తెలిపారు. అన్ని బంగారు, అన్కట్ రత్నాల ఆభరణాల తరుగు చార్జీల పై 30 శాతం వరకు, వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లాంచింగ్ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా హాజరైన కస్టమర్లు శ్రీ విద్య తదితరులు మాట్లాడుతూ మలబార్ గోల్డ్ డైమండ్స్ అన్ని బ్రాంచీల నుండి జ్యులరీలను, వివిధ రకాల ఆభరణాలను కలెక్షన్ చేసి నంద్యాలలోని మల బార్ గోల్డ్ షోరూములో షో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గోల్డ్, ఆభరణాలు ఎక్కవగా మలబార్ గోల్డ్‌లోనే కొనుగోలు చేస్తుంటామని తెలిపారు. ఇక్కడ ప్యూరిటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ మహిజ్, మార్కెటింగ్ సిబ్బంది మన్సుర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు పల్స్ పోలియో కార్యక్రమం

- జిల్లా వ్యాప్తంగా 2,38,404 మంది ఐదేళ్లలోపు చిన్నారులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

దేశంలో పోలియోతో బాధ పడకూడదనే ఉద్దేశ్యంతో కేంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలియో రహిత సమాజంగా మార్చేందుకు ఆదివారం పల్స్ పోలియా చుక్కల కార్యక్రమాన్ని చేపట్టానున్నారు. సున్నా నుండి 5 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలను వేయనున్నారు. అందులో భాగంగా జిల్లాలో గత పది రోజుల నుండి పోలీయో చుక్కల కార్యక్రమంపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 19,20,925 మంది జనాభా ఉండగా అందులో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు 2,38,404 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. వీరందరికి ఆదివారం చుక్కలు వేస్తారు. జిల్లాలోని నంద్యాల, ఆత్మకూర్, డోన్ రెవిన్యూ డివిజన్‌లలో 51 పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్లు 16 ఉన్నాయి. వీటిలో 1313 పోలియో చుక్కల బూత్‌లను ఏర్పాటు చేశారు. 46 రూట్ బృందాలను, 5252 టీకాలు, ఎంఎల్‌హెచ్‌పిలు 369 మందిని, 605 ఏఎన్ఎంలు, 1595 మంది ఆశాలు, 1663 మంది అంగన్‌వాడీలు, 68 మొబైల్ టీంలు, 136 మొబైల్ టీం బృందాలు మొత్తం 4,63,867 ఇళ్లను కవర్ చేయనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను సర్వం సిద్ధం చేసుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ ప్రజాశక్తితో తెలిపారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.




## విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి తనిఖీ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** పట్టణంలోని మహాలక్ష్మి విత్తన విక్రయ కేంద్రాలు, క్రిమిసంహారక మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. రైతులు కొన్న ఎరువులకు, క్రిమిసంహారక మందులకు బిల్లులు అందజేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనుమతులు లేని బయో పెస్టిసైడ్స్‌ను విక్రయించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడిఏ విజయ్ శేఖర్, మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.



ఫోటో నెంబర్ :7 రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

# 'వికసిత్ భారత్' బిల్లును రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

యూనియన్ క్యాబినెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు'ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, లతీఫ్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' బిల్లును ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుతో మార్చి యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. యుజిసి, ఏఐసిటిఈ, ఎన్‌సిటిఈ వంటి సంస్థల స్థానంలో హెచ్ఈసిఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం, ఆర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యా రంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి, మతతత్వీకరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ వికృత అజెండాను ఖరారు చేసే ప్రయత్నమే ఈ చర్య అన్నారు. ఈ బిల్లు ఆమోదం వల్ల భారతదేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు, పని తీరులో భారీ మార్పులు వస్తాయన్నారు. ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. యుజిసినీ రద్దు చేయడం వల్ల వృత్తి విద్యా కోర్సులు లేని ఉన్నత విద్యా సంస్థల గొంతు నులిమినట్లవుతుందన్నారు. ఇక్కడ నిధులు 'గ్రాంట్స్' నుండి 'లోన్ సర్వీసింగ్' (అప్పులు)కు మారుతాయని, దీనివల్ల విద్య అనేది కేవలం ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే ఖరీదైన వస్తువుగా మారుతుందన్నారు. ప్రజలు, మేధావులు, విద్యార్థి సంఘాల నుండి వచ్చిన తీవ్ర విమర్శలను బేఖాతరు చేస్తూ ఈ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని సూచిస్తోందన్నారు. రాష్ట్రాలలోని విద్యా సంస్థలపై కేంద్రం తన భావజాలాన్ని రుద్దడానికి, వాటిపై పట్టు సాధించడానికి ఈ మార్పును ఒక సాధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉప సంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల నాయకులు మధు, దస్తగిరి, రియాజ్, డేవిడ్, సునీల్, అస్లాం, అఖిల్, హర్ష, నరసింహ, మనీ, షాహిద్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్ష ఆదిస్తాన్' బిల్లును వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంలోని స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో వారు మాట్లాడారు. మండల ఎస్ఎఫ్ఐ నాయకులు నితిన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** యూనియన్ క్యాబినెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు 2025' ఆమోదాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి హరివర్ధన్ అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని ఐటిఐ కళాశాల వద్ద బిల్లుకు సంబంధించిన ప్రతులను వారు దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, మణి, కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో బిల్లు ప్రత్రులను దహనం చేస్తున్న నాయకులు



ఆత్మకూరు : మాట్లాడుతున్న నాయకులు


నందికొట్కూరు : బిల్లు ప్రత్రులను దహనం చేస్తున్న నాయకులు


అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం

## డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివచంద్రా రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు, రోగులకు అవగాహన కల్పిస్తూ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ నరసింహ ఆధ్వర్యంలో వైద్యాధికారులు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## యాదవ సంఘం మండల ఉపాధ్యక్షుడు మృతి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని కొండపేటకు చెందిన యాదవ సంఘం మండల ఉపాధ్యక్షుడు సానెం సుబ్రహ్మణ్యం యాదవ్(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ జి. మద్దయ్య యాదవ్, నాయకులు దాట్ల శ్రీరాములు యాదవ్, గంగన్న యాదవ్, నామాల శివుడు యాదవ్, లక్కీ మధు యాదవ్‌లు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జి.మద్దయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి సుబ్రహ్మణ్యం యాదవ్ ఎంతో కృషి చేశారని, ఆయన మృతి యాదవ సంఘానికి తీరని లోటన్నారు.


సానెం సుబ్రహ్మణ్యం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను ఆదేశించారు.. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్, పి4 అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీసీ రోడ్డు , పింఛన్లు, ఇతర సమస్యలపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలో ఏవైనా పాఠశాలలకు ప్రహరీ గోడ లేకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ కు సంబంధించి ఏమైనా పెండింగ్ పనులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు నూర్జహాన్, తాహెర్ హుస్సేన్ సావిత్రి, మధుసూదన రావు, శివమల్లేశ్వరప్ప, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రుద్రవరం ఎస్ఐగా ఇ.జయప్ప

**ప్రజాశక్తి - రుద్రవరం**



రుద్రవరం నూతన ఎస్ఐగా ఈ.జయప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ కడప 2టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఈ.జయప్పను రుద్రవరం ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో బాధ్యతలను స్వీకరించి మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సత్వరమే సమస్య పరిష్కారం చేసే దిశగా ముందుంటానని తెలిపారు. శాంతిభద్రతల కోసం ఎలాంటి అవసరం ఉన్నా తన నంబర్ 9963606075కు ఫోన్ చేయాలని తెలిపారు. మండలంలోని శాంతిభద్రతలకు, ట్రాఫిక్ నియంత్రణకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 23న నేషనల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా


**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాలలోని నేషనల్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో మొత్తం 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చని, 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెజ్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9551400588, 8297812530 నంబర్లను లేదా http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.


# రాష్ట్ర స్థాయికి 'ఆదర్శ' విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక

**ప్రజాశక్తి - రుద్రవరం**

జిల్లా స్థాయిలో ఈ నెల 19న నిర్వహించిన జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో రుద్రవరం ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి శశిధర్ గ్రీన్ ఎనర్జీలో భాగంగా మినీ వాటర్ క్రేన్ అంశంపై రూపొందించిన వినూత్న శాస్త్రీయ ప్రాజెక్ట్‌తో స్టేట్ లెవల్‌కు ఎంపికయిందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి వనరుల ప్రాధాన్యతను ప్రతిబింబించే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌లో విద్యార్థి శశిధర్ తన సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన, ప్రయోగాత్మక నైపుణ్యాలను చాటిచెప్పాడన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ విజయానికి పాఠశాల సైన్స్ ఫ్యాకల్టీ అందించిన నిరంతర మార్గనిర్దేశం కీలకంగా నిలిచిందన్నారు. ఇన్చార్జి ఉపాధ్యాయిని రజినీ, సైన్స్ ఫ్యాకల్టీ లలిత, నజీయ, మున్నిస బేగం, సుప్రియ, విర ప్రకాష్ అగ్రికల్చరల్ జ్యోతి ప్రాజెక్ట్ రూపకల్పన, భావన స్పష్టత, శాస్త్రీయ విశ్లేషణలో అందించిన సహకారం అభినందనీయ మన్నారు. ఈ ఘన విజయానికి కారకులైన విద్యార్థి శశిధర్‌కు, సైన్స్ ఫ్యాకల్టీకి, అగ్రికల్చర్ ఉపాధ్యయ బృందం, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది.


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

# జిరాంజి బిల్లును ఉపసంహరించుకోవాలి : ఎఐకెఎస్


నంద్యాల కలెక్టరేట్ : డిఆర్ఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



ప్యాపిలి : నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు


ఆత్మకూరు : బాపనంతాపురంలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు


నందికొట్కూరు టౌన్ : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న


పాములపాడు : అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

**ప్రజాశక్తి - ఆత్మకూరు**

ఉపాధి హామీ చట్టం ఊపిరి తీసే జిరాంజి బిల్లును వెంటనే ఉపసంహకరించుకోవాలని మండలంలోని బాపనంతపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ రాజశేఖర్ మాట్లాడుతూ 2005లో వామపక్షాల పోరాటంతో ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. ఈ పథకం వల్ల పేదల జీవితాలు కొంతైనా మెరుగుపడ్డాయని, ఇతర పనులకు ఈ పథకం వల్ల కూలి పెరిగిందని తెలిపారు. అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిర్వీర్యం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తూ వస్తుందని ఆరోపించారు. నిధులు తగ్గించడం, యంత్రాలు ఉపయోగించడం, నిధులను పక్కదారి మళ్ళించడం లాంటి తప్పుడు కారణాలు చూపిస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. 100 రోజుల పని గ్యారంటీగా ఉన్నా 40 రోజులకు మించి ఎక్కడా పని చూపించలేదన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఈ ఉపాధి చట్టంలోని మహాత్మా గాంధీ పేరు తొలగించి జి.రాంజీ పథకం పేరుతో కొత్త బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మరోవైపు గతంలో కేంద్రం 90శాతం, రాష్ట్ర వాటా 10 శాతంగా ఉండేదన్నారు. పథకం మార్చి కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం వాటగా నిర్ణయించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకునేలాగా రైతులు ప్రజలు వ్యవసాయ కార్మికులు నిరసనలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పౌర సమాఖ్య నాయకులు సురేంద్ర, వ్యవసాయ కూలీలు సావిత్రమ్మ, రమణమ్మ, పుష్పావతి, అయ్యమ్మ, మరియమ్మ, సంజీవ్, వినోద్, ఇజ్రాయిల్, సుబ్బయ్య, మోజెస్, రాముడు, భాస్కర్ పాల్గొన్నారు.

**నందికొట్కూరు టౌన్ :** ఉపాధి హామీ చట్ట సవరణను ఉపసంహరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ విగ్రహం దగ్గర ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సి నాగన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి పి.పకిర్ సాహెబ్, సిఐటియు పట్టణ అధ్యక్షులు టి గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు బేస్తరాజు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయాలనే కుట్రలో భాగంగా జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి విబిజి రామ్‌జిగా పేరు మార్పు చేయడానికి పార్లమెంటులో ఆమోదం పెట్టడం దారుణమన్నారు. ఉపాధి హామీ చట్ట సవరణ వెంటనే విస్తరించకపోతే గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ, కొంగర వెంకటేశ్వర్లు, సంపంగి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, మహిళా సంఘం కార్యదర్శి సాజిదాబి, కెవిపిఎస్ కార్యదర్శి ఆర్. జయరాణి, రైతు సంఘం మండల అధ్యక్షుడు కె. తారేష్, ప్రజా సంఘాల నాయకులు రాము, హర్షవర్ధన్, ముర్తు జావలి, కె. రమణ, శ్రీను, లక్ష్మీ, రామకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ప్యాపిలి :** గ్రామీణ వలసలను నివారించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో 2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకే కేంద్రం కొత్త బిల్లు తీసుకొచ్చి జాతిపిత మహాత్మాగాంధీని అవమానించిన గాడ్సే వారసులకు తగిన గుణపాఠం తప్పదని సిఐటియు నాయకులు చిన్న రహిమాన్, పి. రామాంజనేయులు, ఇలియాజ్ హెచ్చరించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజలకు అన్ని విధాల హాని చేసే కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతిఘటించాలిని తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్ర, రవి, జాఫర్, ఖాదర్, హనుమంతు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

**పాములపాడు :** మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరు మార్చి వికసిత్ జిరామ్‌జి పేరు పెట్టడం దుర్మార్గమైన చర్య అని ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రమైన స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర మేకల రాజు ఆధ్వర్యంలో కళ్ళకు నల్ల గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో ఇప్పటివరకు 18 లక్షల జాబ్ కార్డులను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మార్చిన పేరు తిరిగి అలాగే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి స్వామన్న, నాయకులు టి వెంకటేశ్వరరావు, ఎస్ బాలయ్య, ప్రజాసంఘాల నాయకులు కలబండి అంకన్న, షేక్షావలి, ఎస్ ముర్తుజావలి, సాయికృష్ణ, ఆటో వర్కర్స్, సిఐటియు హమాలి నాయకులు పాల్గొన్నారు.

**నంద్యాల కలెక్టరేట్ :** కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన వికసిత భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ ఘర్ అండ్ అజవిక మిషన్ గ్రామీణ బిల్లును రద్దు తక్షణమే చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని రైతు, కౌలు రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రైతు, కౌలు రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిఆర్ఓ రామ్ నాయక్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు నరసింహ నాయక్, టి.రామచంద్రుడు, మార్క్, వెన్న బాల వెంకట్‌లు మాట్లాడుతూ పేదలందరికీ ఉపాధి ద్వారా జీవనం కల్పిస్తున్న ఉపాధి చట్టాన్ని క్రమంగా నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా జి రామ్ జి బిల్లును తీసుకువచ్చిందన్నారు. భారతదేశంలోని వ్యవసాయ కార్మికులు, రైతుల కడుపులు కొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. స్వాతంత్ర సమరయోధుడైన మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయమన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధి కూలీల కడుపు కొట్టే కొత్త బిల్లును ప్రభుత్వం వెంటనే రద్దు చేసి పాత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శ్రీనివాస రెడ్డి, ఎన్.చెన్నయ్య, కరిముల్లా, శ్రీనివాస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పాణ్యం :** గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మంగళం పాడొద్దని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాణ్యం బస్టాండ్ కూడలిలో జరిగిన నిరసన కార్యక్రమంలో జి రాం జి బిల్లు ప్రతులను దహనం చేశారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి ప్రసాద్, సిఐటియు నాయకులు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు చెన్నయ్య పాల్గొన్నారు.

**గోస్పాడు :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ ఉపాధిని హరించే జీ రామ్ జీ బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో బలవంతంగా ఆమోదించడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. కోవెలకుంట్ల-నంద్యాల ప్రధాన రహదారిపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మార్క్ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.చెన్నయ్య, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు కరీముల్లా, మల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి - బేతంచర్ల**

బేతంచర్ల పట్టణం షాలెం చర్చి, గోర్లగుట్ట గ్రామం సిఎస్ఐ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దాసన్న, సెక్రెటరీ డివిఎస్ ప్రసాద్, సిఎస్ఐ పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఆయా చర్చిలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణం, గ్రామాల వీధుల్లో పాటలు ఆలపిస్తూ క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హోసన్నా పాస్టర్ సామ్యూల్, కల్వరి చర్చి శేఖర్, బ్రదర్ విద్యా రాజు, జోయల్ పాల్గొన్నారు.

## అలరించిన సంప్రదాయ నృత్యం

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్**

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీజనయిత్రి నృత్యాలయ బృందంచే శనివారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా వినాయకకౌత్వం, తాండవ నృత్యకరీ, భో..శంభో, లింగాష్టకం, శివాష్టకం, అయిగిరినందిని, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు, అష్టకాలకు హరితప్రవీణ్, అనిత, శరణ్య, హిమవర్ష, ధాత్రి, సహస్ర తదితరులు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

## తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ



**ప్రజాశక్తి - కోవెలకుంట్ల :** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు కొనసాగించాలని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని అప్పుడే ప్రమాదాలు ఉండవని వానచోదకులకు సూచించారు. నంద్యాల వైపు వెళ్లే ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులకు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయండి రోడ్డు ప్రమాదం నుంచి రక్షణ పొందండి అని అవగాహన కల్పించారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

**ప్రజాశక్తి - మిడుతూరు** : గ్రామీణ ప్రాంత రైతు సోదరులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి అన్నారు. మండల మహిళా సమైక్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ, అనుబంధ సంఘాలు ప్రకృతి వ్యవసాయ విభాగం కలిసి శనివారం మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి మహిళా రైతు, రైతు సోదరులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఇళ్ల దగ్గర పెరటి తోటలు వేయాలని, వాటి వచ్చే ఆహారం మనం తీసుకోవడంతో ఆరోగ్య వంతంగా ఉంటామన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దశరథరామయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎఒ పిరు నాయక్, ఎపిఎం సుబ్బయ్య, మహిళా సంఘాలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం దాసు, డిజిటల్ నరేంద్ర, రవీంద్ర, అయ్యస్వామి పాల్గొన్నారు.

## గోకులం షెడ్‌లను త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాశక్తి - పాములపాడు** : గోకులం షెడ్‌లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎంవిఎన్ రాజు ఆదేశించారు. పాములపాడు గ్రామంలోని చిన్న స్వాములు లబ్ధిదారుడు నిర్మిస్తున్న గోకులం షెడ్‌లను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మినీ గోకులం షెడ్‌లలో ఆరు పశువులు ఉండేలా లబ్ధిదారులు నిర్మించుకోవాలన్నారు. రూ.2 లక్షలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంసిడిఒ చంద్రశేఖర్, ఎపిఒ జయంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ :** లోకకల్యాణం కోసం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం స్వామిఅమ్మవార్లకు శనివారం ఊయలసేవ నిర్వహించింది. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఊయలలో ఆశీనులుగా చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు నిర్వహించింది.

## ప్రమాదవశాత్తు మహిళ మృతి

**ప్రజాశక్తి - బండి ఆత్మకూరు :** మండలంలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన బండి భాగ్యమ్మ(73) అనే మహిళ శనివారం ఉదయం 10 గంటలకు కేసీ కెనాల్ కాల్వలో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి ప్రవాహంలో కొట్టుకొని పోయి మరణించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలు బండి భాగ్యమ్మ కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడినట్లు ఆమె కూతురు జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

## మెనూ పాటించాలి : డిప్యూటీ ఎంపిడిఒ

**ప్రజాశక్తి - ప్యాపిలి** : విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు డిప్యూటీ ఎంపిడిఒ ప్రభాకర్ సూచించారు. గుడిపాడు సచివాలయం, పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. సచివాలయంలో పలు రికార్డును పరిశీలించి మాట్లాడారు. సిబ్బందికి ఆన్లైన్లో బయోమెట్రిక్ రెండుసార్లు నమోదు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు బహదూర్ బాష తదితరులు పాల్గొన్నారు.


# పంట పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ టవర్లు

- రైతులకు అందని నష్టపరిహారం
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లు

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

పచ్చని పంట పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విద్యుత్ టవర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. సాగు చేసిన పంట పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయడంతో పొలంలో కొంత భాగం శాశ్వతంగా పంట దిగుబడిని కోల్పోతున్నట్లు రైతులు చెబుతున్నారు. నష్ట పరిహారం ఏ మేరకు చెల్లిస్తున్నారో అధికారులు చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇక్కడ కాంట్రాక్టర్ చెప్పిందే వేదంగా కొనసాగుతుందని రైతులు చెబుతున్నారు.

కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయిపల్లి, మదనంతపురం, బందార్లపల్లి, అబ్దుల్లాపురం తదితర గ్రామాల పరిధిలో పచ్చని వ్యవసాయ పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ టవర్లు నిర్మిస్తున్నారు. సాగు చేసుకునే పంట పొలాల్లో పవర్ గ్రిడ్ విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయడంతో రైతులు మండిపడుతున్నారు. నష్టపరిహారం చెల్లింపు గురించి చెప్పకుండానే పంట పొలాల్లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. చింతలయపల్లి గ్రామంలో రాజశేఖర్ అనే రైతు చీని తోటను సాగు చేశాడు. తమ పొలం పరిధిలో చీని చెట్లు తొలగించి, బోరు కింద వేసిన డ్రిప్పు పైపులన్నీ ధ్వంసం చేశారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తన పొలంలో దాదాపు 30 సెంట్ల పైనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. నష్టపరిహారం గురించి రైతుకు తెలియపరచకుండా పంట పొలాన్ని ధ్వంసం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ టవర్ ఏర్పాటు చేసే సందర్భంలో అక్కడికి వెళ్లేందుకు వాహనాలను ఉపయోగిస్తున్నారు. చీని చెట్లను కొట్టేసి వాహనాల్లో వెళ్లడం ద్వారా భూమి లోపల వేసుకున్న పైపులైన్లు ధ్వంసం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఒక్కో విద్యుత్ టవర్ ఏర్పాటు చేయాలంటే పొలంలో 10-30 సెంట్ల వరకు శాశ్వతంగా పంట దిగుబడి కోల్పోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ నష్టాన్ని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ లైన్ కింద బోరు బావులు తవ్వించాలన్నా ఇబ్బందులు తలెత్తుతాయని, వాటికి పరిష్కారం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్ల నుండి ఎలాంటి సమాధానం లేదన్నారు. తమ అభిప్రాయలను పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఊరికి సమీపంలో గల పొలాల్లో హై పవర్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చని పంట పొలాలను నాశనం చేస్తూ చేపట్టిన పవర్ గ్రిడ్ విద్యుత్ టవర్లు, లైన్ ఏర్పాట్లపై రైతన్నలు భగ్గుమంటున్నారు. పవర్ గ్రిడ్ అధికారులు, కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. బాధిత రైతుల అభిప్రాయలు తెలుసుకోలేదన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా తమ పచ్చని పంట పొలాలను ధ్వంసం చేస్తూ విద్యుత్ టవర్ల నిర్మాణం చేపట్టడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. టవర్లు నిర్మించే పొలాలకు సంబంధించిన రైతులను ఫోన్లలో సంప్రదిస్తూ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామ సభలు నిర్వహించే అధికారం తమకు లేదని కలెక్టర్ నిర్ణయంతో పొలాల్లో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేదంటే శాశ్వతంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.


పంట పొలాల్లో టవర్ల కోసం తీసిన గోతులు

# పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**



నందికొట్కూరు మున్సిపాల్టీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ ఎస్. బేబిలు స్థానిక జై కిసాన్ పార్కులో శనివారం దుస్తులు పంపిణీ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్రకు వెలకట్టలేనిదన్నారు. వారి కష్టానికి గౌరవంగా ఈ చిరుకానుకను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది అంతా ఒకే కుటుంబంలా పండగలను జరుపుకోవాలన్న ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేసినట్లు కమిషనర్ బేబీ తెలిపారు. పారిశుధ్య కార్మికులు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికుల సంక్షేమమే మా ప్రాధాన్యత అని, ప్రతి ఒక్కరూ పండగను సంతోషంగా జరుపుకోవాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చాంద్ బాష, మున్సిపల్ మేనేజర్ సుహృలత, డిఇ నాసీర్, ఎఇ దినేష్ కుమార్, ఆర్ఒ మధుసూదనరావు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జీ అమానుషం : సిఐటియు

**ప్రజాశక్తి - ప్యాపిలి**



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు


నెల్లూరులో న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడం అమానుషమని సిఐటియు నాయకులు ఖండించారు. పట్టణ కార్యదర్శి టి. శివరాం, మండల కన్వీనర్ ఎవి. భాస్కర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు నక్కి శ్రీకాంత్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లయప్పల డోన్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు 45 రోజులుగా శాంతియుతంగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నా అధికారుల నుండి ఎటువంటి స్పందనా లేకపోవడంతో విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సందర్భంగా అధికారులను నేరుగా కలిసి తమ గోడును విన్నవించాలని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించకపోగా లాఠీఛార్జీ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు గోవిందు, మద్దయ్య, యేసురత్నం, ఆవులయ్య, రామాంజి, శ్రీరాములు, రంగనాయకులమ్మ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

# తరలిపోతున్న అటవీ సంపద

- అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న వెదురు
- యథేచ్ఛగా నిత్యం బొలెరో వాహనాల్లో వెదురు అక్రమ రవాణా
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

**ప్రజాశక్తి - మహానంది**

నిత్యం నల్లమల అడవిలో నుండి బొలెరో వాహనాల్లో వెదురు అక్రమ రవాణా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. తాజాగా నంద్యాల రేంజ్‌లోని మహానంది పుణ్యక్షేత్రం ఆవరణలోని పార్వతీపురం కాలనీ ఆర్చి పక్కన ఉన్న అటవీ ప్రాంతం నుండి నిత్యం వాహనాల మీద వెదురు అక్రమణ రవాణా కొనసాగుతోంది. పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం భారీ ఎత్తున వెదురును డంపింగ్ చేసి ఉండటం తీవ్ర దుమారం లేపుతుంది. నిత్యం బొలెరో వాహనాల్లో భారీ ఎత్తున వెదురు అక్రమణ రవాణా చేస్తున్నా అటవీ శాఖ అధికారులు చూస్తూ నిమ్మకుండిపోవడంతో పలు విమర్శలకు దారితీస్తోంది. ఇదంతా అటవీ శాఖ అధికారుల కనుసైగల్లోనే జరుగుతుందా? లేక నిజంగా అటవీశాఖ అధికారులకు తెలియకుండా జరుగుతుందా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు. అటవీ శాఖ కార్యాలయం ముందే వెదురు అక్రమ రవాణా జరుగుతుండటం మరీ గమనార్హంగా మారింది. ఏది ఏమైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు అటవీ సంపదను ఇలా అడ్డదారుల్లో తరలిస్తుండడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


తరలించేందుకు సిద్ధంగా ఉన్న వెదురు


ఖోఖోలో రన్నర్‌గా గెలుపొందిన జ్యోతి హైస్కూల్ జట్టు

## విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి - బండి ఆత్మకూరు**

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని జ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ నర్లశేషమ్మ తెలిపారు. ఇటీవల నంద్యాల డివిజన్లో జరిగిన ఖోఖో పోటీల్లో జ్యోతి హైస్కూల్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచి క్రీడల్లో తమ ప్రతిభను కనబరిచారని ఆమె వారిని అభినందించారు. జ్యోతి హైస్కూల్‌లో చదివే విద్యార్థిని విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యతోపాటు క్రీడల్లో మంచి శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. జ్యోతి హైస్కూల్ కోఆర్డినేటర్స్ నర్ల హర్షవర్ధన్ రెడ్డి, నర్ల నవీన్ రెడ్డిలు మాట్లాడారు. జ్యోతి స్కూల్‌లో నైపుణ్యం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. తద్వారా అన్ని క్రీడల్లోనూ విద్యార్థిని విద్యార్థులు రాణిస్తున్నారని చెప్పారు. ఖోఖోలో రన్నర్‌గా నిలిచిన జట్టు సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

## డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రేణుకా లావణ్య

**ప్రజాశక్తి - ప్యాపిలి**



డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రేణుకా లావణ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నామినేటెడ్ పదవులను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్యాపిలి పట్టణానికి చెందిన రాజా నారాయణ మూర్తి సతీమణి రేణుకా లావణ్యను డోన్ మార్కెట్ యాడ్ చైర్మన్‌గా అధిష్టానం ప్రకటించింది. వారు శనివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా నేను ముందుండి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ పదవితో మరింత బాధ్యత పెరిగిందని, రైతులకు అండగా ఉంటామన్నారు. ఈ అవకాశం కల్పించిన సిఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలి

**ప్రజాశక్తి - బండి ఆత్మకూరు**

గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ చంద్రమౌళి అన్నారు. మండలంలోని భోజనం గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుండి ఎలాంటి సమస్యలు రాకుండా ఆధార్ కార్డులు ప్రతి ఒక్కరికీ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రనాయక్, డిజిటల్ అసిస్టెంట్ బాలరాజు, హెల్పర్ వాసు సుకుమారు, ఆధార్ ఆపరేటర్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

## వారాంతపు సంతకు సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**


ఎంపిడిఒకు వినతి పత్రమిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంత మార్కెట్‌లో వ్యాపారస్తులకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు, మండల కార్యదర్శి సూర్యనారాయణలు ఎంపిడిఒ కార్యాలయంలోని డిప్యూటీ ఎంపిడిఒ చంద్రమౌళికి శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సంత మార్కెట్‌కు వచ్చే వ్యాపారస్తులకు షెడ్లు, బాత్రూం సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వారంతపు సంత మార్కెట్‌లో షెడ్యూలు నిర్మించి వ్యాపారస్తులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతి పత్రమిచ్చిన వారిలో సిపిఐ సీనియర్ నాయకులు రాజశేఖర్, వెంకటేష్, పెద్దయ్య, వినయ్, బికె నర్సింహులు, రఘు తదితరులు ఉన్నారు.



వైకుంఠం జ్యోతికి ఘన స్వాగతం పలుకుతున్న ఫాతిమా స్కూల్ సిబ్బంది

## చదువుతోనే బంగారు భవిష్యత్తు

**- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి - సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న సిబ్బంది

చదువులో రాణిస్తేనే జీవితాలు బంగారుమయం అవుతాయని టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి తెలిపారు. శనివారం చిప్పగిరిలోని ఫాతిమా ఇంగ్లీష్ పాఠశాలలో మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. మినీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఫాతిమా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన నేమకల్లు గ్రామానికి చెందిన ఆర్.షేక్షావలీకి, ఇతర విద్యార్థులకు వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ... మినీ క్రిస్మస్ వేడుకలకు హాజరు కావడంతో వేడుకలను కళ్లారా చూశాను, విద్యార్థులకు చదువు అలవాటు నేర్పుతున్న ఫాతిమా పాఠశాల సిబ్బందిని అభినందిస్తున్నామని తెలిపారు. చదువులో రాణిస్తేనే ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. డిసిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ ఛైర్మన్ కొండా రామాంజనేయులు, టిడిపి కన్వీనర్ కొండా పురుషోత్తం, సర్పంచులు దాసరి గోవిందరాజులు, నీలకంఠ, బెల్డోన గోవిందు, బిజెపి నాయకులు గోపాల్, తిమ్మయ్య, మాజీ ఎంపిటిసి సంగాల భాస్కర్, చంద్ర, మహేష్, పోతురాజు రాముడు, గుమ్మనూరు జయన్న, దేవక్క గారి జయన్న, మండల మాజీ కన్వీనర్ వైకుంఠం వెంకటేశులు, ఎంఇఒ సావిత్రమ్మ, శాస్త్ర కాలేజ్ కరస్పాండెంట్ శేఖర్, జనార్ధన స్వామి, బోగేష్, తిమ్మప్ప, మాధవ్, బంటనహాల్ సురేష్, ఫాతిమా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనడమే గాక బందోబస్తు నిర్వహించారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

**- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి**



మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

విద్యతో విజ్ఞానం, పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను, విద్యార్థులు పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. టిడిపి యువ నాయకులు ఎన్.రాజారెడ్డి, కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, టిబి ఎల్ఎల్‌సి ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సొసైటీ ఛైర్మన్ వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, ఎంపిడిఒ నూర్జహాన్, డిప్యూటీ రామాంజినేయులు, ఎంఇఒ మొయినుద్దీన్, సిడిపిఒ రాజేశ్వరి, స్కూల్ ఛైర్మన్ ఆంజనేయ పాల్గొన్నారు.

## ఎస్ఐ ఈశ్వర రావు బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - హాలహర్వి**



హాలహర్వి ఎస్ఐగా ఈశ్వర రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఈ.మారుతి కర్నూలు డిఎస్‌బికి బదిలీ కావడంతో, ఈశ్వర రావు హాలహర్వి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఈశ్వర రావు మాట్లాడారు. లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేకంగా నిఘా ఉంచుతామని, చోరీల నియంత్రణకు, జూదం, పేకాట, కోడి పందేలు తదితరాల నియంత్రణపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. నాటు సారా తయారీ, అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు స్టేషన్‌లో సిబ్బంది తనకు సహకరించాలని కోరారు.

# అభినవ బుద్ధుడు సంత్‌గాడ్గేబాబా

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ఏపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీరనారి ఐలమ్మ భవన్‌లో సంత్ గాడ్గే బాబా వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో మొదట స్వచ్ఛ భారత్ నిర్మాణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి చదువు ఉంటేనే జ్ఞానం, విలువ, అన్ని సంత్ గాడ్గే బాబా అని అన్నారు. 1956 డిసెంబర్ 20న సంత్ గాడ్గే బాబా మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన అంజన్‌గావ్ తాలూకాకు చెందిన షేన్‌గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో జన్మించారని తెలిపారు. తల్లిదండ్రులు జింగ్రాజీ, సక్కుబాయి దేబూజీ సింగ్‌రాజీ జానోర్కర్ స్వచ్ఛ నిర్మాణం స్థాపించి స్ఫూర్తి సందేశాన్ని ఇచ్చారన్నారు. సంత్ గాడ్గే బాబా చరిత్రను మార్చాలి అనుకుంటే మార్చేది కాదని, చదువుకుంటే జ్ఞానంవస్తుందని, జ్ఞానం ద్వారా విజ్ఞానం వికసించి చైతన్య వస్తుందన్నారు. చైతన్యం ద్వారా సామాజికన్యాయం, ఆర్థిక,సామాజిక మార్పుకోసం,రాజకీయ ఎదుగుదల...అని చెప్పిన సంత్ గాడ్గే బాబా దేశానికే ఆదర్శంగా నిలిచిన గొప్ప వాగ్గేయకారుడని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా ప్రజా జీవితంలో ఉండాల్సిసిన 10 సూత్రాల నమ్మిన సంత్ గాడ్గే బాబా ఆకలికి అన్నం, దాహానికి నీరు, దుస్తులు లేనివారికి వస్త్రాలు, పేదలకు విద్య, రోగులకు వైద్యం, తల దాచుకోవడానికి గూడు, ముగజీవులకు రక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతి యువకులు వివాహం.అని బోధించిన గొప్ప మహోన్నతుడని కొనియాడారు. న్యూ సిటీ కార్యదర్శి సి. శేషాద్రి, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శేఖర్ బాబు, న్యూ సిటీ అధ్యక్షుడు సి. రాముడు ,ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, కర్నూలు నగర నాయకులు మద్దిలేటి ఎల్లయ్య, ప్రజానాట్యమండలి నాయకులు బాలు, గిడ్డయ్య, లక్ష్మి, సరిత, డివైఎఫ్ఐ నాయకులు హుస్సేన్‌బాష అబ్దుల్లా, సిఐటియు నాయకులు నగేష్ , గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సంత్ గాడ్గేబాబా చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు గురుశేఖర్, తదితరులు

## పల్స్ పోలియో అవగాహన ర్యాలిని ప్రారంభించిన జెసి

**జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

పల్స్ పోలియో అవగాహన ర్యాలిని శనివారం గాంధీ విగ్రహం దగ్గర జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.ఎల్.భాస్కర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలి కలెక్టర్ కార్యాలయం నుండి ప్రారంభమై మెడికల్ కాలేజీ వరకు కొనసాగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికి వారి తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజనికి కృషి చేయాలన్నారు. భారతదేశంను పోలియోరహిత దేశంగా ప్రకటించిన ఇంకా ఆ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి చిన్నారుల భవిష్యత్తును కాపాడవలసిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందని ముఖ్యంగా తల్లిదండ్రులు, వైద్యసిబ్బంది పై ఉందని తెలిపారు. పోలియో వ్యాధి నుండి పిల్లలను రక్షించుటకు ఈ కార్యక్రమంలో 0–5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయించాలని తెలిపారు. భారతదేశంలో 2011 సంవత్సరంలో ఆఖరి పోలియో కేసు నమోదు అయిందని 2014 నుండి భారతదేశంను పోలియో రహిత దేశంగా గుర్తించారన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లల భవిష్యత్తు సంరక్షణకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో వ్యాధిని నిర్లక్ష్యం చేస్తేమీ చిన్నారుల భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకొన్నట్టేనని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, అందరు సమిష్టిగా సమన్వయంగా ముందుకు సాగి పల్స్ పోలియోను 100శాతం విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.భాస్కర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అవసరమైన మెటీరియల్, ఫార్మేట్స్, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణి చేశామని పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లను జనసమూహాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో అతికించి ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు.



జెండాఊపి పల్స్‌ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి నూరుల్ ఖమర్

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కుంటేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్య మవుతుందని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట బసవరావు అన్నారు. శనివారం రాయలసీమ విశ్వ విద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని వైస్ ఛాన్సలర్ వెంకట బస్వరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు ప్రిన్సిపల్ ఆచార్య సి. విశ్వనాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




ఆర్‌యులో స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విసి

**వొకేషనల్ లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ :** కర్నూలు నగరంలోని బి క్యాంప్‌లోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర–సర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో కళాశాల లెక్చరర్లు , విద్యార్థులు స్వచ్ఛాంధ్ర–ప్రతిజ్ఞ చేశారు. కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, మల్లికార్జున, విజయశేఖర్, పార్థసారథి పటేల్, లక్ష్మి మరియు తదితరులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.




వొకేషనల్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగస్వామినాయక్

## జనరల్ బాడిలో బస్సుల వేళలపై చర్చ

**ప్రజాశక్తి-సి బెళగల్**

జనరల్ బాడీ సమావేశంలో కర్నూలు నుండి గూడూరు సి బెళగల్ మీదుగా ఎమ్మిగనూరు కు బస్సుల వేళలపై శనివారం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ రూటులో ఒకేసారి ఒకే సమయంలో రెండు మూడు లేదా నాలుగు ఐదేసి బస్సులు ఒకే వైపు వెళ్తుంటాయని, ఆ బస్సులు వెళ్ళాక మరో బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఎంపిటిసి ఈరన్న గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తకోట ఎత్తిపోతల పథకం నిబంధనలకు లేదని పునః పరిశీలన చేసి త్వరలో ప్రారంభం చేయాలని కొత్తకోట ఎంపిటిసి మణిమోహన్ డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంబాలు కాలం చెల్లాయని కొత్త స్తంబాలు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు సభ్యులు విన్నవించారు.అందుకు సంబంధించిన అధికారులకు తగు ఆదేశాలు ఇస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

## 'ఉపాధి ' జాతిపిత పేరుతోనే కొనసాగించాలి :సిపిఎం

**ప్రజాశక్తి-సి బెళగల్**

జాతీయ గాంధీ ఉపాధి హామీ పథకం జాతి పిత గాంధీ పేరుతోనే కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.మోహన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ప్రజా సంఘాల కమిటీలతో వెళ్లి ఎంపిడిఒ రాణెమ్మకు వినతిని అందించారు. కడు నిరుపేదలకు, కూలీలకు చేతి నిండా పనులు పెట్టి ఉపాధి పథకం ద్వారా వారి కడుపులు నింపేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని చేసి అమలులోకి తెచ్చిందన్నారు. జాతి పిత గాంధీ పేరు మీదనే కూలీలకు, వలసల నివారణకు ప్రజా సంఘాలు ఎంతో కృషి చేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మొత్తానికి ఆ పథకం రద్దు చేయాలన్న కుట్రతో విజిరామ్‌జి పథకంగా మార్చి నియంతలా చేస్తున్నారని సుమారు రూ.20 కోట్ల మంది కూలీలకు గ్రామాల్లో పని దొరకదని వాపోయారు. వలసలతో కూలీల, బాలల బతుకులు బుగ్గి కావాల్సిందేనని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22 న జిల్లా కేంద్రాలలో మహా ధర్నాలు ఉన్నాయని అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**-కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**

**ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర నేషనల్ సర్వీస్ స్కీమ్ కార్యక్రమాన్ని కర్నూలు మండలం, నూతనపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. స్వచ్ఛత ద్వారా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రజలందరూ స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో ఒకరు శుభ్రత కోసం బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మా అమ్మ శీలమ్మ సర్పంచుగా ఉన్న సమయంలో రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఆదివారం పోలియో చుక్కలు ప్రతి ఒక్కరు ఐదు ఏండ్ల వయసు వరకు ఉన్న పిల్లలకి తల్లిదండ్రులు, సమాజం బాధ్యత వహించి వేయించాలని పిలుపునిచ్చారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ ద్వారా రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ నేషనల్ సర్వీస్ స్కీమ్ ద్వారా ఈ నెలలో నూతన పల్లి గ్రామాన్ని ఎంచుకొని ఎయిడ్స్ పైన అవగాహన కల్పించడం, మెడికల్ క్యాంప్ పెట్టడం, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేయడం, ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు చేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఈ సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, ఎంపిడిఒ రఘునాథ్, డిఎల్‌డిఎం రమణారెడ్డి, పంచాయతీ సెక్రటరీ హేమంత్ కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శివ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది ,స్థానిక కూటమి నాయకులు ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయం తనిఖీ

**ప్రజాశక్తి -కోడుమూరు**

మండల పరిధిలోని లద్దగిరి గ్రామంలో సచివాలయాన్ని ఎంపిడిఒ ఎసి రాముడు తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరును పర్యవేక్షణ చేసి వారి హాజరును పరిశీలించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న రీ సర్వే అంశాన్ని కూడా పరిశీలించి వారికి సమయపాలన పాటించే విధంగా కార్యాలయాలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలందరితో కూడా ప్రతిజ్ఞ చేయించారు.

### 361 పాఠశాలలకు మెంటర్ల నియామకం

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు 361 పాఠశాలలకు 361 మంది అధికారులను మెంటర్లుగా నియమించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం విద్యా శాఖ పై జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో 66 శాతం ఉతీర్ణతా శాతం మాత్రమే వచ్చిందన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 90 శాతం చేరుకోవాలని తెలిపారు. డ్రాపౌట్ అయిన 1559 మంది 10వ తరగతి విద్యార్థులను వారి తల్లి తండ్రులతో మాట్లాడి, వారిని వెంటనే వెనక్కి పిలిపించి పాఠశాలకు హాజరు అయ్యేలా చూడాలన్నారు. ,టెలి కాన్ఫరెన్స్‌లో డిఇఒ ఎల్.సుధాకర్, సమగ్ర శిక్ష ఎపిసి లోకరాజు, జిల్లా, మండల స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి శాస్త్ర ప్రదర్శనలో అంబేద్కర్ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

**ప్రజాశక్తి -వెల్దుర్తి**

కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి శాస్త్ర వైజ్ఞానిక ప్రదర్శనలో వెల్దుర్తి మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. వినోదాత్మక గణిత నమూనాల అంశంలో మూడు పరిమాణాల ఆకృతులు అనే ప్రాజెక్ట్‌తో పాల్గొని న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. 9వ తరగతి విద్యార్థిని రెహానా, 7వ తరగతి విద్యార్థిని భార్గవి సృజనాత్మకంగా రూపొందించారు. మూడు పరిమాణాల గణిత ఆకృతులను సులభంగా అర్థమయ్యే విధంగా నమూనాగా ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులకు ఉపాధ్యాయురాలు జి.ముజీబున్నీసాబీ సమర్థంగా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసూన విద్యార్థినులు, ఉపాధ్యాయురాలిని అభినందించి, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయం గురుకుల పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనకు, గణిత అవగాహనకు మరింత ప్రోత్సాహం ఇస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు.

## పోలియో రహిత మండలమే లక్ష్యం

**- డాక్టర్ అప్రోజ్ జహాన్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

పోలియో రహిత మండలమే లక్ష్యంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, ప్రజలు కృషి చేయాలని ప్రభుత్వ డాక్టర్ అప్రోజ్ జహాన్ తెలిపారు. శనివారం డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి పంచాయతీలోనూ పాఠశాలల విద్యార్థులతో పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. నేమకల్లు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న, ఎఎన్ఎం గాయత్రి, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్ల సమన్వయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. పోలియో చుక్కలు వేయించాలని నినాదాలు చేస్తూ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర' నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. **గోనెగండ్ల** ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిని డాక్టర్ రంగ రవళి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి ఆస్పత్రి నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మేరీ, హనుమంతు, సుధాకర్, పరమేష్, శాంతమ్మ పాల్గొన్నారు. **కౌతాళం** పిహెచ్‌సి నుంచి బస్టాండ్ వరకు మెడికల్ ఆఫీసర్ రజిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ రాజశేఖర్, వైద్యాధికారిణి పావని, సిహెచ్ఒ శంషాద్ బేగం, పిహెచ్ఎన్ స్వర్ణలత, సూపర్‌వైజార్ వెంకటరాముడు, కరీంముల్లా, ఎంఎల్‌హెచ్‌పి అంజలి పాల్గొన్నారు.



నేమకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు




గోనెగండ్లలో



కౌతాళంలో...

## సంతానం లేని వారికి ఆధునిక ఐవిఎఫ్ పద్ధతి చక్కని పరిష్కారం

**-అమృత టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్ లో ఐవిఎఫ్ పై భారీ డిస్కౌంట్**

**-అమృత హాస్పిటల్ టెస్ట్యూబ్ బేబి సెంటర్ ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇ. విజయలక్ష్మి**

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**



సంతానం లేని వారికి ఆధునిక ఐవిఎఫ్ పద్ధతి చక్కని పరిష్కారమని కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్ లోని అమృత హాస్పిటల్ టెస్ట్యూబ్ బేబి సెంటర్‌లో భారీ డిస్కౌంట్‌తో ఐవిఎఫ్ చేయబడునని ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్, ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇ. విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇ.విజయలక్ష్మి ప్రజాశక్తితో మాట్లాడుతూ సాధారణ గర్భం దాల్చలేని జంటలు సంతానోత్పత్తి కోసం బాధపడుతున్న దంపతులకు ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) అనే ఈ ఆధునిక పద్ధతిలో మంచి అవకాశమని అనేక జంటలు దీనివల్లే తల్లిదండ్రలయ్యారు. ఐఇఎఫ్ (ఇన్‌విట్రోఫెర్టిలైజేషన్) అనేది భార్య అండాలను భర్త శుక్రకణంతో ప్రయోగశాలలో ఫలదీకరణం చేసి, ఆపై ఆ ఫలదీకరణం చెందిన పిండాన్ని గర్భాశయంలో అమర్చే ఒక సహాయక పునరుత్పత్తి ప్రక్రియ అని అన్నారు. దీని ద్వారా అనేక జంటలు దంపతులయ్యారని రాయలసీమలోనే అత్యధిక సక్సెస్ రేట్ కలిగిన ఏకైక ఫెర్టిలిటి సెంటర్ అమృత హాస్పిటల్ టెస్ట్యూబ్ బేబి సెంటర్ అని తెలిపారు. ఇది ఐవిఎఫ్ లక్షలలో ఖర్చు అవుతుందని క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా భారీ డిస్కౌంట్ తో కేవలం 89,999 రూ.లకే ఐవిఎఫ్ చేయబడని ఆమె తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ 1 డిసెంబర్ 2025 వతేది ప్రారంభమైయిందని ఈ నెల 31 డిసెంబర్ 2025 వరకు మాత్రమే ఈ భారీ డిస్కౌంట్ తో చేయబడనన్నారు. ఈ సందర్భంగా ఉచిత కన్సల్టేషన్, ఉచిత స్కానింగ్, ఉచిత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అపాయింట్ మెంట్ కొరకు ఫోన్: 08518–232046, 229398 సెల్: 7671894442 సంప్రదించాలని కోరారు.




## ఎపిఎన్‌జిజిఒ తాలూకా కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-ఆలూరు**

ఆలూరు తాలూకా ఎపిఎన్‌జిజిఒ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షులు మోహన్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నూతన కార్యవర్గం ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఎం.లక్ష్మీనారాయణ వ్యవహరించారు. కార్యవర్గం నామినేషన్ పర్వాన్ని కొనసాగించి నామినేషన్ ఫారంలో సింగల్ నామినేషన్స్ అన్ని పోస్టులకు రావడంతో సంఘం అధ్యక్షులు మోహన్ ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ ప్యానెల్‌లో సెక్రటరీగా శేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మురళీమోహన్, శంకరానంద, కమలమ్మ, సుజాత, జాయింట్ సెక్రటరీగా మహేష్, అశోక్ కుమార్, అయ్యన్న, ఉమెన్ వింగ్ సెక్రటరీగా సుగుణ, ట్రెజరర్‌గా ఉల్లిగప్ప ఎన్నికైనట్లు తెలిపారు. అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ... రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.




## రావూస్ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

**ప్రజాశక్తి - ఎమ్మినూరు**



పరిశీలిస్తున్న విద్యార్థులు

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం బీకామ్ మహిళా విద్యార్థులు, బిబిఎ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన ద్వారా శనివారం ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘాన్ని, రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను సందర్శించారు. సెక్రటరీ అప్పాజీ, డిజైనర్ కమ్ మార్కెటింగ్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ... ఒకరికోసం అందరూ.. అందరి కోసం ఒకరు అనే నినాదంతో చేనేత సహకార సంఘం పని చేస్తోందని తెలిపారు. సంఘంలో తయారయ్యే వివిధ చేనేత వస్త్రాల క్రయ, విక్రయాల పట్ల అవగాహన కల్పించారు.బిబిఎ విద్యార్థులు పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను సందర్శించారు. మార్కెటింగ్ మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ... వివిధ వస్తువుల అమ్మకాలు, కొనుగోలు పట్ల మహిళా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీనియర్ అధ్యాపకులు కామర్స్ విభాగాధిపతి విజయ్ కుమార్, వీరేష్, బిబిఎ విభాగం తరపున జ్యోతి, సురేఖ పాల్గొన్నారు.

## 'ఉపాధి'ని యథావిధిగా కొనసాగించాలి

**- 22న ధర్నా : వామపక్షాలు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాముడు

ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని వామపక్షాల నాయకులు కోరారు. ఈనెల 22న ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాయకులు జి.రంగన్న, బి.రాముడు, రాజు మాట్లాడుతూ... వలసలు నివారించి పేదలకు, కూలీలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. 'వి బి–జి–రామ్ జి' అనే కొత్త బిల్లును పార్లమెంట్ ప్రవేశపెట్టి ఆమోదించడం దుర్మార్గమని విమర్శించారు. ఈ కొత్త బిల్లు వల్ల ఉపాధి హామీ కూలీలకు ఒరిగేదేమీ ఉండదన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి నాయుడు, సిపిఐ గోనెగండ్ల మండల కార్యదర్శి శ్రీరాములు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ప్రసాద్, సిపిఐ నాయకులు దాదావలీ, ఉరుకుంద, నరసింహులు, నాగరాజు, మల్లికార్జున గౌడ్, నీలకంఠ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక సమావేశం

**ప్రజాశక్తి-మద్దికేర:** మద్దికేర మండల మహిళా సమైక్య ఆఫీస్‌లో అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు క్లస్టర్ ఐసిఆర్‌పి భీమరాజు తెలిపారు. ఇందులో అన్ని గ్రామాలకు సంబంధించిన విఒఎలు విహెచ్‌ఎలు బుక్ కీపర్ లు గ్రామైక సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు క్లస్టర్ ఇన్చార్జి , ప్రకతి వ్యవసాయ సిబ్బంది చ సిఆర్‌పి, ఐసిఆర్‌పి, బిఆర్‌సి సెంటర్ ఓనర్లు అందరూ హాజరయ్యారు. సిఆర్‌పి భీమరాజు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులందరికి ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని దాని ద్వారా పండించిన ఉత్పత్తులని ఆహారంగా తెలుసుకోవాలని తద్వారా ఎటువంటిరోగాలకు గురికాకుండా నివారించుకోవచ్చున్నారు. దీనివలన భూమి సారవంతం, పెరిగి మనషుల ఆరోగ్యం ఆర్థికవృద్ధి చెందుతుందన్నారు. వెలుగు, ప్రకృతి వ్యవసాయ, అగ్రికల్చర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పన్నుల వసూలు వేగం పెంచండి

ప్రజాశక్తి - శిరివెళ్ల



మాట్లాడుతున్న ఇఓపిఆర్‌డి

మండల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టి వేగవంతం చేయాలని ఈఓపిఆర్‌డి శ్రీనివాసుల శర్మ ఆదేశించారు. మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, వ్యాపార కేంద్రాల పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సూచించారు. పన్నులు ఫోన్ పే లేదా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాలని, అనధికారికంగా డబ్బులు చెల్లించి రసీదులు తీసుకోకుండా ఉండడం సరైన మార్గం కాదన్నారు. ఆన్లైన్ ట్రాన్సక్షన్ అయినా ఆఫ్‌లైన్ చెల్లింపులైనా తప్పనిసరిగా చెల్లించిన మొత్తానికి రసీదులు పొందాలని ప్రజలకు సూచించారు.

## ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి : డిఇఒ

**ప్రజాశక్తి - పాణ్యం :** ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటేనే విద్యార్థులకు సమగ్రమైన సంపూర్ణమైన విద్యను అందిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంను డిఇఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల రిసోర్స్ పర్సన్స్ చేస్తున్న బోధన తీరును పరిశీలించారు. అలాగే రాబోయే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను ముందు స్థానంలో ఉంచేలా ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ముస్తాబు



మండల ఉపాధ్యాయ సిబ్బందితో డీఈవో

కార్యక్రమాన్ని పాఠశాలల్లో సమర్ధవంతంగా నిర్వహించి విద్యార్థిని విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతను పెంచి తద్వారా పాఠశాల ఆవరణ పరిశుభ్రతను కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్‌ఎం రాములు నాయక్, మండల రిసోర్స్ పర్సన్ లు రాజశేఖర్ పాల్గొన్నారు.

## వినతులను త్వరగా పరిష్కరించాలి : మంత్రి

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వినతులను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధితుల సమస్యలను సంబంధిత




అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. బనగానపల్లె పట్టణంలోని పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు..

## ఎరువుల దుకాణాలను ఎఒ తనిఖీ

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని కలి మున్నీసా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ఎంసిఎస్ నరసింహులు, బీసీ వెంకటసుబ్బయ్య, శ్రీ బీసీ వెంకటసుబ్బయ్య, శ్రీనివాస ఫెర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా, డీఏపీ నిల్వలు, వాటిరిజిస్టర్లను పరిశీలించారు. యజమానులు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్ పాటించాలన్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా బిల్లులు



స్టాక్ పాయింట్ ను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిని

తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిఎస్‌డబ్ల్యు సర్వేకు మినహాయింపు ఇవ్వండి

ప్రజాశక్తి - బనగానపల్లె

జిఎస్‌డబ్ల్యు సర్వే నుండి తమకు మినహాయింపు ఇవ్వాలని విఆర్వోలు తహశీల్దార్ నారాయణ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. విఆర్‌ఒల సంఘం నాయకులు శివరామయ్య, గోవిందప్ప మాట్లాడుతూ వీఆర్వోలకు రెవిన్యూ పనుల ఒత్తిడి అధికంగా ఉందని, జిఎస్‌డబ్ల్యు సర్వేకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కుల్లాయి, మధు, విజయలక్ష్మి, సురేంద్ర, వీరేష్, గంగన్న, ప్రసాద్, ఓబులేసు తదితర విఆర్వోలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

# పోలియో రహిత సమాజమే లక్ష్యం : మంత్రి



పల్స్ పోలియో ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పోలియో రహిత సమాజమే అందరి లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఐదు సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో టంగుటూరు, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సోయల్, మాధవి, సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు దీపానాగమణి, జాబీద, జబీర్‌లు తెలిపారు. కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న 0-5ఏళ్లలోపు పిల్లలందరికి ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. **వెలుగోడు :** వెలుగోడు మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో పోలియో చుక్కలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎఎన్ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆశా వర్కర్లు కె లక్ష్మీదేవి, పార్వతి, పాఠశాల ఉపాధ్యాయుడు నబీ రసూల్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** 0-5ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం మరవద్దని తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ దస్తగిరి బాబులు మండలంలోని బెలూం గ్రామంలో పల్స్ పోలియో చుక్కలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ నరేష్ యాదవ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **పగిద్యాల :** నేడు ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన జీవితానికి రెండు చుక్కలు వేయించి పోలియోను తరిమేద్దామని నినాదాలు చేశారు. **కోవెలకుంట్ల :** చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో బారి నుండి కాపాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి తెలిపారు. చిన్నారులకు చుక్కలు వేయించడంలో ఆశా, అంగన్వాడీ వర్కర్లు కృషి చేయాలని ఆయన కోరారు. **రుద్రవరం :** నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి బాబు , డాక్టర్ ఏం జయలక్ష్మి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 752 మంది 5 సంవత్సరంలోపు పిల్లలను గుర్తించామని, వారందరికీ పోలియో చుక్కలు వేస్తారన్నారు. **అవుకు :** అవుకు మండలంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం చేపడుతున్నట్లు ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారిని డాక్టర్ యమునా తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు 3900 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలను అందించేందుకు 37 బూతులను ఏర్పాటు చేశామన్నారు.

# ఘనంగా 'మ్యాథ్స్ అండ్ మైండ్ కార్నివల్' ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉన్న శ్రీ శాంతినికేతన్ స్కూల్లో 'మ్యాథ్స్ అండ్ మైండ్ కార్నివల్' కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం శని, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా పాఠశాల చైర్మన్ సుధాకర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత అంశాలపై ఆధారిత నృత్య ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తయారు చేసిన అద్భుతమైన గణిత వర్కింగ్ మోడల్స్, చార్ట్స్, పజిల్స్, గణిత ఆటలు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. ఈ ఎగ్జిబిషన్‌కు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను శ్రమను ప్రశంసించడంతో పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గణిత ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో తార్కిక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయన్నారు. 'మ్యాథ్స్ అండ్ మైండ్ కార్నివల్" పాఠశాలలో విద్యకు కొత్త దిశను చూపించిన కార్యక్రమంగా నిలిచి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఘన విజయాన్ని సాధించిందని వెల్లడించారు.



మ్యాథ్స్ ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాల చైర్మన్ సుధాకర్




సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న చిన్నారులు



రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ కు ఎంపికైన విద్యార్థులు

## రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు శనివారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థులు జి మధు, రోహిత్‌లు సైన్స్ ప్రాజెక్టు అండ్ ఈ స్లీపింగ్ అలారం ఫర్ డ్రైవర్స్ అనే ప్రాజెక్టు డ్రైవర్లు నిద్రలో జరిగే ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు పుల్లయ్య, పుష్పలత, తబషుం, రామిరెడ్డి, ఎసిసి ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## ఘనంగా 'క్రిస్మస్ హై-టీ' కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం తరపున మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్-2025 హైటి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడు, ఏసుక్రీస్తు అని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... సుమారు రెండువేల ఏళ్ల క్రితం రోమ్ సామ్రాజ్యంలో జన్మించిన ఏసుక్రీస్తు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి ఆరాధ్యుడు, దయామయుడు, కరుణా మయుడుగా క్రైస్తవులతో ఆరాధనలు అందుకుంటున్నారన్నారు. క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు డిసెంబర్ 24, 25వ తేదీలలో అత్యంత ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం తరపున సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. క్రీస్తు విలువలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని క్రిస్మస్ అంటే శాంతికి చిహ్నం రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, సుఖ సంతోషాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజును ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ హైటీ కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేసి క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ రాము నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జి.రాజకుమారి

# రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి స్పష్టత అవసరం

**- హార్టికల్చర్ మిషన్ అమలుపై అనుమానాలు నివృత్తి చేయాలి**
**- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి**

ప్రజాశక్తి - నంద్యాల

రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత ఇవ్వాలని, హార్టికల్చర్ మిషన్ అమలుపై అనుమానాలను నివృత్తి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. శనివారం నంద్యాల సమితి కార్యాలయంలో కార్యవర్గ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హార్టికల్చర్ హబ్ ద్వారా చేపట్టే మౌలిక సదుపాయాల నిర్మాణాలు రైతుల జీవనాన్ని మార్చగలవన్న ముఖ్యమంత్రి ప్రకటన రాయలసీమ ప్రజల్లో ఆశలు రేకెత్తించిందని పేర్కొన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో పూర్వోదయ పథకం కింద ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌ల అభివృద్ధికి, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించినప్పటికి, ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని విమర్శించారు. ఇది హార్టికల్చర్ మిషన్ అమలుపై రాయలసీమ వాసుల్లో అనుమానాలు రేకెత్తిస్తోందన్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా రాయలసీమలో ఇప్పటికే నిర్మిత ప్రాజెక్టులతో పంటపొలాలకు నీటి కనెక్టివిటీకి స్వల్ప నిధులు కూడా కేటాయించలేని పరిస్థితి నెలకొందన్నారు. అలగనూరు రిజర్వాయర్, అన్నమయ్య ప్రాజెక్టు వంటి కీలక ప్రాజెక్టుల పునరుద్ధరణకు అనేక సంవత్సరాలుగా నిధులు కేటాయించకపోవడం, అత్యంత కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టులో ఏర్పడిన లోపాలను సరిదిద్దేందుకు అవసరమైన నిధుల కేటాయింపులో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఇది అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితి 'పులి మీద సవారీ' చేసినట్టుగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒక శ్వేతపత్రంను వెంటనే విడుదల చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన సమగ్ర చర్చలు జరపాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలో జరిగిన తప్పులను సకాలంలో సరిదిద్దకపోతే రాయలసీమ మరింత నష్టపోయే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితి రాకముందే ప్రభుత్వం మేల్కొని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా దృఢ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి లేఖ పంపామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు యర్రం శంకర రెడ్డి, చెరుకూరి వెంకటేశ్వరనాయుడు, ఏరువ రామచంద్రారెడ్డి, న్యాయవాది అసదుల్లా, మనోజ్ కుమార్ రెడ్డి, జానో జాగో కన్వీనర్ మహబూబ్ భాష, పట్నం రాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి

# '104' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- డిఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా**

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. ఏసురత్నం, ఏ నాగరాజు ఏపీ 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.ఆర్ ఫణి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సమస్యలు పరిష్కారం కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఎంహెచ్‌ఓ వెంకటరమణకు సమర్పించారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ 104 ఎంఎంయూ నిర్వహణన భాధ్యతను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ కేర్ సర్విస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గత ఏడు నెలల నుండి 104 ఉద్యోగులపై అనేక వేధింపులకు గురి చేస్తుందన్నారు. గత అరబిందో సంస్థ 104 ఉద్యోగులకు చివరి నెలలో చెల్లించిన జీతాలలో ప్రతి ఉద్యోగికి 500 నుండి 2000 వరకు కోతలు విధించిందని అనేక సంవత్సరాల నుండి అమలులో ఉన్న 15 క్యాజువల్ లీవ్ లను పూర్తిగా రద్దు చేసిందని ఆరోపించారు. బఫర్ సిబ్బందిని తొలగించిందని తెలిపారు. భవ్య యాజమాన్యం ఉద్యోగుల అసంతృప్తిని తగ్గించాల్సింది పోయి ఉద్యోగ సంఘ నాయకులకు షోకాజ్ నోటీసులు, సస్పెండ్‌లు చేస్తూ ఆన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్‌కి పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తుందని తెలిపారు. చేట్ల రాంబాబు సెలవులో ఉండగా జరిగిన వాహన తనిఖీలకు భాధ్యుడిని చేస్తూ 16వ తేది సస్పెండ్ చేసిందని ఇది తీవ్ర అన్యాయమన్నారు. స్థానికత ఆధారంగా ఉద్యోగులకు ట్రాన్స్ ఫర్లకు అవకాశం కల్పించాలన్నారు. వాహనాలకు ప్రతినెలా సర్వీస్ నిర్వహించి, పూర్తి కండిషన్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తగ్గించిన పిఎఫ్ వాటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.




ధర్నా చేస్తున్న నాయకులు

# పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రతి క్లాస్ రూమ్‌లోకి వెళ్లి ఆయన విద్యార్థినిలతో పలు విషయాలపై ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలరని విద్యార్థినీలు తప్పనిసరిగా భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ప్రతిరోజు ప్రతి విద్యార్థి పరిశుభ్రతను అలవాటు చేసుకున్నట్లయితే అన్ని విషయాల్లో ఉత్సాహంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, ఎంఇఒ మార్గరెట్, కమిషనర్ రమేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్రలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొని పాఠశాల ఆవరణంలో చెట్లు నాటి, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. వడ్డెమాన్ పాఠశాలలో చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సత్యం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సర్పంచి రామచంద్రుడు, తలారి వెంకటరాముడు, గజేంద్ర, దిలీప్ నాయుడు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంత ప్రజలు పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం అవుతాయని తహశీల్దార్ ఉమారాణి సూచించారు. మండల కేంద్రంలో సర్పంచి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. **బేతంచర్ల :** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, మొక్కలు నాటి వానిటి సంరక్షించి వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలిద్దామని స్పెషల్ ఆఫీసర్ బషీరున్నీసా బేగం, ఎంపిడిఒ ఫజిల్ రహమాన్ అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయం నుండి ఆర్టీసీ కొత్త బస్టాండ్ వరకు కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండు ఆవరణంలో డిప్యూటీ తహశీల్దార్ మారుతి ఆధ్వర్యంలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్లు తస్లీమా, ప్రియాంక, వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది, సుమేధా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు, పొదుపు సంఘాల లీడర్లు, సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మెప్మా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ దస్తగిరి బాబు, తహశీల్దార్ ఎం శ్రీనివాసులు అన్నారు. మండలంలో బెలూం గ్రామంలో ఎంపిడిఒ, తహశీల్దార్, డిప్యూటీ ఎంపిడిఒ చంద్రమౌళి గౌడ్‌లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ అధికారి నరేష్ యాదవ్, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని పరిశుభ్రతను జీవన శైలిగా మార్చుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ పేర్కొన్నారు. నంద్యాల కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో చెత్త తొలగించారు. అనంతరం డిఆర్‌ఒ అధికారులు, సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. **పాణ్యం :** రాబోయే తరాలకు మనం అందించే అతి పెద్ద ఆస్తి పర్యావరణ సమతుల్యత అని పాణ్యం తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఏపిఎం ప్రసాద్, లాయర్ బాబు, రమణ మూర్తి, గ్రామపంచాయతీ కార్యనిర్వాహక అధికారి వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్పెషల్ ఆఫీసర్ ఎస్.రహిమాన్ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో అమ్మవారి శాల 4 రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్ రెడ్డి, మండల పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ హరి కిషన్, రుద్రవరం ఇంచార్జ్ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ జిల్లా అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్త చెదారం తొలగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిఈలు, ఎఈలు, సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి :** పర్యావరణాన్ని పరిరక్షించి కాలుష్యాన్ని నివారించే బాధ్యత మనందరిదని జిల్లా బిసీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి జగ్గయ్య తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటి ఎంపీడిఓ తారేకశ్వరి, ఆర్‌ఐ సత్తార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపిఎం నాగమ్మ, సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి గోపాల్, ఎమ్మార్వో జ్యోతి రత్న కుమారి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ బాబు, ఎంఈఓ శోభ వివేకవతి తదితరులు మాట్లాడారు. పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య, ఇన్చార్జి శానిటరీ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



నందికొట్కూరులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే



నంద్యాలలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం



ఆళ్లగడ్డలో...